విశాఖపట్టణం
మంగళవారం 29 సెప్టెంబర్ 2026

For a pure tomorrow..

జయ జయహే

epaper.jayajayahey.com సంపుటి: 9 సంచిక: 228 వెల: రూ.5/- పేజీలు: 8

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool


# పేదల కల సాకారం



372 మందికి పట్టాలు పంపిణీ

మంగళగిరిలో అందజేసిన మంత్రి లోకేశ్

2

# ఎండీఆర్‌పై అఫిడవిట్ దాఖలు చేయండి

## చార్జీల విధానం, ప్రాతిపదిక ఏంటో చెప్పండి

## 140 కోట్ల మందిపై ప్రభావం చూపే నిర్ణయం ఇది

## కార్యనిర్వాహక పరిధి ఏమిటో వివరణ ఇవ్వడి

## యూపీఐ వాణిజ్య లావాదేవీలపై సుప్రీం కీలక వ్యాఖ్యలు







(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

యూపీఐ వాణిజ్య లావాదేవీలపై కొత్తగా విధించనున్న మర్చంట్ డిస్కౌంట్ రేట్ ఛార్జీలపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. యుపిఐ ఎండీఆర్ ఛార్జీల విధానం, ప్రాతిపదికపై వివరణాత్మక అఫిడవిట్ సమర్పించాలని కేంద్రానికి ఆదేశించింది. నాలుగు వారాల్లో కౌంటర్ అఫిడవిట్‌లు దాఖలు చేయాలని సూచించింది. జస్టిస్ బాగ్చీ 140 కోట్ల మందిపై ప్రభావం చూపే ఈ నిర్ణయం వెనుక ఉన్న కార్యనిర్వాహక పరిధి ఏమిటని ప్రశ్నించారు. కేంద్రం అఫిడవిట్ దాఖలు చేసిన తర్వాత అక్టోబర్ చివరి వారం లో కేసు విచారణ కొనసాగనుంది. ఈ కేసు విచారణ సందర్భంగా అదనపు సొలిసిటర్ జనరల్ ఎన్. వెంకట్రామన్ కేంద్రం తరఫున వాదనలు వినిపించారు.. యూపీఐ వినియోగదారుల్లో 96 శాతం మందికి ఈ ఛార్జీల నుంచి మినహాయింపు ఉందని తెలిపారు. నిత్యావసర సేవల లావాదేవీలపై గరిష్టంగా రూ.5కే పరిమితం చేశామని వివరించారు. ఇది ప్రభుత్వం వసూలు చేసే రుసుము లేదా పన్ను కాదని, బ్యాంకులు-గేట్‌వేల మధ్య జరిగే సెటిల్‌మెంట్ ఫీజు అని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా తీసుకోవడం లేదని, ఎన్‌పీసీఐ దీన్ని సులభతరం చేస్తుందని పేర్కొన్నారు. అక్టోబర్ 15 నుంచి ఈ నూతన నిబంధన మొదటి మైలురాయిగా అమలులోకి రానుందని న్యాయస్థానానికి వివరణ ఇచ్చారు.

**పిటిషనర్ వాదనలు ఏంటీ?**

యూపీఐ చెల్లింపులపై 0.4 శాతం ..మిగతా 2లో




# సీటు.. హీటు..!

## గ్రేటర్ పొలిటికల్ బడ్జెట్ స్క్రీన్

## భారీ బడ్జెట్ కార్పొరేషన్ పై కన్ను

## రేసులో పలువురు కీలక నేతలు

## కూటమిలో కుస్తీ.. వైసీపీలో వ్యూహం

(విశాఖపట్నం - జయజయహే)

గ్రేటర్ విశాఖ మేయర్ పీఠం.. భారీ పొలిటికల్ బడ్జెట్ సీట్ గా హీట్ రేపుతోంది. 98 వార్డులతో ఉన్న కార్పొరేషన్ 120 వార్డులతో మరింత విస్తరించడంతో ఎమ్మెల్యేలను మించి పొలిటికెల్ క్రేజ్ ను షేక్ చేస్తోంది. ఏ నేతకైనా సరే మినిమం రూ. 100 కోట్లు ఎలక్షన్ బడ్జెట్ ఉంటేనే గ్రేటర్ వార్ లో టాప్ గేర్ వేసినట్టుగా పొలిటికల్ ఎనలిస్టులు భావిస్తున్నారు. ప్రత్యక్ష ఎన్నికలతో రాజకీయ ప్రాధాన్యత పెరగడంతో మేయర్ రేసులో నేతలు, వారసులు.. రంగంలోకి దిగడంతో గ్రేటర్ విశాఖ పొలిటికల్ స్క్రీన్ ఇప్పుడు దద్దరిల్లుపోతోంది. రూ.4 వేల కోట్లకు పైగా జీవీఎంసీ బడ్జెట్ ఉండటంతో నగర రాజకీయాలపై పట్టు కోసం వందల కోట్ల రూపాయలు ఖర్చుయినా పర్లేదని ప్రధాన పార్టీలు ..మిగతా 2లో

# ఖైరతాబాద్ అసెంబ్లీ ఖాళీ

## దానంపై అనర్హత వేటు

## గెజిట్ నోటిఫికేషన్ జారీ

## త్వరలోనే ఉప ఎన్నిక ఖాయం

(హైదరాబాద్ - జయజయహే)

తెలంగాణ రాజకీయాల్లో పార్టీ ఫిరాయింపుల వ్యవహారం ఆసక్తికరంగా మారుతోంది. ఇప్పటికే ఖైరతాబాద్ నుంచి గెలిచిన దానం నాగేందర్ పై అనర్హత వేటు పడింది. హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు కూడా సమర్థించటంతో... ఇక్కడ ఉప ఎన్నిక అనివార్యమైంది. ఈ పరిస్థితుల నేపథ్యంలో ఖైరతాబాద్ శాసనసభ స్థానం ఖాళీగా ఉన్నట్లు శాసనసభ కార్యదర్శి గెజిట్ విడుదల చేశారు. తెలంగాణ ఉన్నత నాయస్థానం (హైకోర్టు) సెప్టెంబర్ 18, 2026న ఇచ్చిన తీర్పు ఆధారంగా... ఈ నిర్ణయం తీసుకున్నారు. రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్ పేరా 2(1)(ఝ) తో పాటు ఆర్టికల్ 191(2) నిబంధనల ప్రకారం దానం నాగేందర్ తన ఎమ్మెల్యే సభ్యత్వాన్ని కోల్పోయినట్లు గెజిట్‌లో స్పష్టంగా పేర్కొన్నారు. అనర్హత వేటు నిర్ణయం అమలులోకి రావడంపై గెజిట్‌లో కీలక అంశాన్ని పొందుపరిచారు. 2024 ఏప్రిల్ 23వ తేదీ నుంచే అమలులోకి వచ్చేలా ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయినట్లు అధికారికంగా ..మిగతా 2లో




# బంగాళాఖాతంలో వాయుగుండం

## మయన్మార్ - అండమాన్ మధ్య కేంద్రీకృతం

## పలు జిల్లాలకు రెడ్ అలెర్ట్

## విశాఖలోనూ వర్షాలు



(విశాఖపట్నం - జయజయహే)

బంగాళాఖాతంలో మరో వాయుగుండం ఏర్పడింది. మయన్మార్ - అండమాన్ మధ్య ఇది ఏర్పడినట్లు వాతావరణశాఖ తెలిపింది. రాగల 12 గంటల్లో ఇది తీవ్ర వాయుగుండంగా మారే అవకాశముంది. ప్రస్తుతం అండమాన్‌లోని మాయాబందర్‌కి 580 కి.మీ దూరంలో తూర్పు ఈశాన్యంగా కేంద్రీకృతమై ఉత్తర వాయవ్యంగా బంగ్లాదేశ్ వైపు పయనిస్తోంది. 72 గంటల్లో ఈశాన్య బంగాళాఖాతం ..మిగతా 2లో



# ఏనుగులకు చెక్ పెట్టాల్సిందే

## చిత్తూరులో సంచారంపై అప్రమత్తం కావాలి

## కుంకీ ఏనుగులను రంగంలోకి దించాలి

## డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశాలు

(అమరావతి - జయజయహే)

చిత్తూరు జిల్లా పడిపుట్లబైలు సమీపంలో ఏనుగుల సంచారంపై ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సమీక్షించారు. ఏనుగుల గుంపును అడవిలోకి మళ్లించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ.. ఏనుగుల సంచారం పట్ల నిరంతరం అప్రమత్తంగా వ్యవహరించాలని అన్నారు. మానవ-ఏనుగు మధ్య ఘర్షణలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ..మిగతా 2లో

# 1/70 చట్టంపై సుప్రీంకు గిరిజనం

## హక్కుల పరిరక్షణకు ఏకమైన ఆదివాసీలు

## 2,500 మంది కలసి పిటిషన్ దాఖలు

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)



ఏజెన్సీ ప్రాంతాల్లోని తమ పూర్వీకుల భూములను అక్రమ ఆక్రమణలు, చట్టవిరుద్ధ బదలాయింపుల నుంచి కాపాడుకునేందుకు 2,500 మంది షెడ్యూల్డ్ ప్రాంత గిరిజన రైతులు ఏకమయ్యారు. తమ హక్కుల పరిరక్షణ కోసం దేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టును ఆశ్రయించినట్లు సీనియర్ న్యాయవాది అల్లంకి రమేష్ ఒక ప్రకటనలో వెల్లడించారు. గిరిజన ప్రాంత భూములు కేవలం ఆస్తులు మాత్రమే కావని, తమ సంస్కృతి, సంప్రదాయాలు, జీవనాధారంలో అంతర్భాగమని పేర్కొంటూ ఆదివాసీలు ఈ సుదీర్ఘ న్యాయపోరాటానికి ..మిగతా 2లో

## అందుకే గ్రేటర్‌పై కన్ను..!

2

# 99.92 శాతం నోటీసులు విచారణ

## ఎస్ఐఆర్ ప్రక్రియలో కీలక పురోగతి

## మిగిలినవి 3,629 నోటీసులు మాత్రమే



2

For a pure tomorrow.. జయహే

# ఎండీఆర్‌పై అఫిడవిట్ దాఖలు చేయండి




మొదటి పేజీ తరువాయి...

ఎండీఆర్ చార్జీల విధింపునకు వ్యతిరేకంగా ప్రముఖ న్యాయవాది అంజన్ దత్తా పిటిషన్ దాఖలు చేశారు. సెప్టెంబర్ 14న కేంద్రం జారీ చేసిన నోటిఫికేషన్‌ను, సెప్టెంబర్ 15న ప్రకటించిన ఎండీఆర్ ఫ్రేమ్‌వర్క్‌ను వెంటనే రద్దు చేయాలని పిటిషనర్ సుప్రీంకోర్టును అభ్యర్థించారు. ప్రత్యామ్నాయంగా, పారదర్శక సంప్రదింపులు జరిపి, ఎంఎస్ఎంఈలకు తగిన రక్షణ కల్పించేలా ఈ విధానాన్ని పునఃపరిశీలించాలని కోరారు. భవిష్యత్తులో చేపట్టే ఏ ఎండీఆర్ వర్గీకరణ అయినా వ్యాపారి టర్నోవర్, చట్టబద్ధమైన ఎంఎస్ఎంఈ హోదా, వాస్తవ మార్జిన్లు, భౌగోళిక ప్రాంతం మరియు ఖర్చును భరించే సామర్థ్యం ఆధారంగా ఉండేలా ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. పేమెంట్ అండ్ సెటిల్‌మెంట్ సిస్టమ్స్ యాక్ట్, 2007 లోని సవరించిన సెక్షన్ 10ఏ రాజ్యాంగబద్ధతను ఆయన ప్రశ్నించారు. ఎలాంటి తగిన చట్టబద్ధమైన రక్షణలు, ప్రజా సంప్రదింపులు లేకుండా ఈ సుంకాన్ని హడావుడిగా ప్రవేశపెట్టారని ఆరోపించారు. ఈ నిర్ణయం వివక్షాపూరితంగా ఉందని, తక్కువ మార్జిన్‌లు ఉన్న వ్యాపారులకు, సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలకు ఇది తీవ్ర నష్టాన్ని చేకూరుస్తుందని తెలిపారు. ఈ అదనపు భారం పరోక్షంగా వినియోగదారులపై పడి, ప్రజలు డిజిటల్ లావాదేవీలకు దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. అలాగే, యూపీఐ లావాదేవీలకు, రూపే డెబిట్ కార్డ్ చెల్లింపులకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ఆయన ప్రస్తావించారు ..టూపీఐ ఛార్జీలు వినియోగదారులపై ప్రభావం చూపి బ్లాక్ మనీ పెరగవచ్చని వాదించినా, ధర్మాసనం ప్రస్తుత దశలో స్టే ఇవ్వడానికి నిరాకరించింది.

**యూపీఐ ఎండీఆర్ కొత్త ఛార్జీల వివరాలు**

యూపీఐ ఎండీఆర్ ఛార్జీల కొత్త విధానం ప్రకారం అక్టోబర్ 15 నుంచి రూ.2,000కు పైగా ఉన్న సాధారణ మర్చంట్ లావాదేవీలపై 0.4 శాతం ఎండీఆర్ వర్తిస్తుంది. రూ.75,000కు పైగా ఉన్న లావాదేవీలకు గరిష్ట ఛార్జీ రూ.300గా ఉంటుంది. రైల్వేలు, టెలికాం, బీమా, ఇంధనం, వ్యవసాయ ఇన్‌పుట్స్ వంటి నిత్యావసర రంగాల్లో ఫ్లాట్ రూ.5 మాత్రమే వసూలు చేస్తారు. పిటల్ మార్కెట్ లావాదేవీలపై 0.02 శాతం ఛార్జీ ఉంటుంది. వ్యక్తి నుంచి వ్యక్తికి (పీ2పీ) లావాదేవీలు, రూ.2,000 వరకు మర్చంట్ చెల్లింపులు పూర్తిగా ఉచితంగా కొనసాగుతాయి. నెలకు రూ.1 లక్ష వరకు యూపీఐ క్యూఆర్ ద్వారా రాబడి పొందే చిన్న మర్చంట్లకు కూడా మినహాయింపు ఉంది.

# ఖైరతాబాద్ అసెంబ్లీ ఖాళీ

మొదటి పేజీ తరువాయి...

ప్రకటించారు. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కింద దాఖలైన పిటిషన్లను విచారించిన న్యాయస్థానం ఆదేశాలకు అనుగుణంగా అసెంబ్లీ కార్యదర్శి ఈ చర్యలు చేపట్టారు.

**త్వరలోనే ఉప ఎన్నిక...**

గెజిట్ ప్రకటనతో ఖైరతాబాద్ నియోజకవర్గానికి త్వరలోనే ఉప ఎన్నిక వచ్చే అవకాశాలు ఉన్నాయి. దీనిపై ఎన్నికల కమిషన్ నుంచి నిర్ణయం వెలువడాల్సి ఉంటుంది. ఇప్పటికే ఈసీకి కూడా తగిన సమాచారం అందటంతో... ఇక్కడ బైపోల్ నిర్వహించే అవకాశం ఉంటుంది. ఉపఎన్నిక అనివార్యం కావటంతో రాష్ట్ర రాజధానిలో రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. అధికార కాంగ్రెస్ ఇక్కడ ఎలాగైనా గెలుస్తామని ధీమా వ్యక్తం చేస్తుండగా... మరోవైపు ప్రతిపక్ష బీఆర్ఎస్ ఇప్పట్నుంచే ఫోకస్ చేస్తోంది. నేతలతో కూడా సంప్రదింపులు జరిపే పనిలో పడింది. మరోవైపు ఈ స్థానంపై బీజేపీ జెండా ఎగరవేయాలని ఆ పార్టీ నాయకత్వం కూడా సిద్ధమవుతోంది. ఇటీవలనే ఆ పార్టీ ముఖ్య నేతలు ఉప ఎన్నికపై చర్చించారు.

# ఏనుగులకు చెక్ పెట్టాల్సిందే

మొదటి పేజీ తరువాయి...

ఆదేశించారు. ఏనుగుల గుంపును అడవిలోకి మళ్లించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. కుంకీ ఏనుగులని రంగంలోకి దించాలని ఉపముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు. హనుమాన్ బృందాలు, పోలీసు, రెవెన్యూ సహకారంతో ఏనుగుల సంచారంపై నిరంతరం నిఘా ఉంచాలన్నారు. ఏనుగుల సంచారం ఆధారంగా పరిసర గ్రామాల ప్రజల్ని అప్రమత్తం చేయాలని సూచించారు. పంట నష్టం జరిగిన రైతులకు తక్షణం పరిహారం చెల్లించే ఏర్పాటు చేయాలని అధికారులను డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశించారు

# బంగాళాఖాతంలో వాయుగుండం

మొదటి పేజీ తరువాయి...

బంగ్లాదేశ్ మధ్య ఇది తీరం దాటే అవకాశముంది. వాయుగుండం ప్రభావంతో కోస్తాంధ్ర, రాయలసీమలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశముంది. గంటకు 30 - 40 కి.మీ వేగంతో గాలులు వీచే అవకాశమున్నట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఇటీవలే బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండం ఏర్పడి కళింగపట్నం వద్ద తీరం దాటిన సంగతి తెలిసిందే. దాని ప్రభావంతో ఉత్తరాంధ్ర జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురిశాయి. భారీ వర్షాలు, పెనుగాలులతో అలజడి సృష్టించిన తీవ్రవాయుగుండం కళింగపట్నానికి నైరుతి దిశలో అర్ధరాత్రి తీరం దాటినా ప్రభావం మాత్రం కొనసాగుతోంది. తీరం దాటినా కూడా తీవ్ర వాయుగుండంగానే కేంద్రీకృతమైంది. ఉత్తరాంధ్ర–ఒడిశా–ఛత్తీస్‌గఢ్ భూభాగంపై కేంద్రీకృతమై క్రమేపీ బలహీన పడుతోంది. ఈ ప్రభావంతో అల్లూరి, ఏలూరు జిల్లాలకు రెడ్ అలెర్ట్ ప్రకటించారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, అనకాపల్లి, కాకినాడ జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేశారు. 24 గంటల పాటు భారీ వర్షాలు కొనసాగే అవకాశం ఉంది. కురుస్తున్న వర్షాలకు ఉత్తరాంధ్ర సహా గోదావరి జిల్లాల్లో ఉన్న నదుల్లోకి భారీగా నీరు చేరే అవకాశం ఉంది. గడిచిన 24 గంటల్లో విశాఖలో భారీగా వర్షపాతం నమోదైంది. బంగాళాఖాతంలో వాయుగుండం ప్రభావంతో విజయనగరం జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తోన్నాయి. పలు చోట్ల వర్షాల ప్రభావంతో రహదారులు నీటమునిగాయి. ఇళ్లలోకి నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బొబ్బిలిలో వర్షం ఎడతెరిపి లేకుండా కురుస్తోంది. గురువారం ఉదయం నుంచి కుండపోతగా కురిసిన వర్షాలతో పట్టణంలోని పలు రహదారులు జలమయమయ్యాయి. ఇందిరమ్మ కాలనీ నీట మునిగింది. వరద నీరు ఇళ్లలోకి ప్రవేశించడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

# 99.92 శాతం నోటీసులు విచారణ

(అమరావతి - జయజయహే)

రాష్ట్రంలో ఎస్ ఐ ఆర్ ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో కీలక పురోగతి నమోదైంది. రాష్ట్రవ్యాప్తంగా జారీ చేసిన 44.28 లక్షల నోటీసుల్లో 44.25 లక్షల నోటీసులకు విచారణ పూర్తైంది. దీంతో మొత్తం 99.92 శాతం నోటీసుల విచారణ పూర్తి అయినట్లు అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం 3,629 నోటీసులు మాత్రమే విచారణకు మిగిలి ఉన్నాయి. తిరుపతి, ఎన్టీఆర్, పల్నాడు, అనంతపురం, ప్రకాశం జిల్లాల్లో మిగిలిన నోటీసుల విచారణ పెండింగ్‌లో ఉంది. తిరుపతి జిల్లాలో 2,477 నోటీసులు విచారణకు మిగిలి ఉండగా.. ఎన్టీఆర్ జిల్లాలో 486, అనంతపురంలో 257, పల్నాడులో 205, ప్రకాశంలో109 నోటీసులు విచారణకు పెండింగ్‌లో ఉన్నాయి. గుంటూరు, నెల్లూరు, నంద్యాల, ప్రకాశం, వైఎస్సార్ జిల్లాల్లో అత్యల్పంగా పెండింగ్‌లో ఉన్నాయి. ఇక, ఓటర్ల ఫొటో క్వాలిటీ చెక్‌లో 99.77 శాతం ఆమోదం పొందాయి. రాష్ట్రవ్యాప్తంగా 3.71 కోట్ల మంది ఓటర్ల ఫొటోలను బీఎల్ఓలు పరిశీలించగా.. 3.70 కోట్ల మంది ఓటర్ల ఫొటో క్వాలిటీకి ఆమోదం లభించింది. ఫొటో క్వాలిటీ చెక్‌లో కేవలం 0.23 శాతం పెండింగ్‌లో ఉంది. ఎన్టీఆర్, అనంతపురం, నెల్లూరు, వైఎస్సార్, తిరుపతి జిల్లాల్లో మరింత వేగం పెంచాలని అధికారులు సూచించారు. క్లెయిమ్స్ అండ్ అబ్జెక్షన్స్‌పై ప్రత్యేక దృష్టి సారించారు. ఫారం-6 దరఖాస్తుల్లో 79,779 పెండింగ్‌లో ఉన్నాయి. ఫారం-6 పెండింగ్‌లో తిరుపతి, నెల్లూరు, వైఎస్సార్ జిల్లాల్లో అధికంగా కేసులు ఉన్నాయి. తిరుపతిలో 12,913, నెల్లూరులో 9,904, వైఎస్సార్‌లో 9,118, ప్రకాశంలో 7,321, సత్యసాయి జిల్లాలో 5,441 ఫారం-6 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. అలాగే, ఫారం-6ఏ దరఖాస్తులు 899, ఫారం-7 దరఖాస్తులు 9,035, ఫారం-8 దరఖాస్తులు 37,890 పెండింగ్‌లో ఉన్నాయి. ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో మిగిలిన పనులపై అధికారులు దృష్టిసారించారు. బీఎల్ఓతో కాల్ బుక్ చేసుకునే అభ్యర్థనల్లో మొత్తం పెండెన్సీ 276గా ఉండగా.. వీటిలో 48 గంటలు దాటిన బుక్ ఏ కాల్ కేసులు 84 ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.




# అందుకే గ్రేటర్‌పై కన్ను..!

జయజయహే

జీవీఎంసీకి ఉన్న ఆర్థిక పరిమాణం కూడా మేయర్ పదవిపై రాజకీయ ఆసక్తికి ఒక కారణంగా కనిపిస్తోంది. 2026-27 ఆర్థిక సంవత్సరానికి జీవీఎంసీ రూ.4,047.12 కోట్ల బడ్జెట్‌ను ఆమోదించింది. మొత్తం ఆదాయ అంచనాలు రూ.4,180.37 కోట్లుగా, వివిధ ఖాతాల ద్వారా మొత్తం రసీదులు రూ.3,814.41 కోట్లుగా బడ్జెట్‌లో పేర్కొన్నారు. ఇంత పెద్ద ఆర్థిక వ్యవస్థను నిర్వహించే నగర పాలక సంస్థకు మేయర్ పదవి రాజకీయంగా కీలకంగా మారడంలో ఆశ్చర్యం లేదనే అభిప్రాయం రాజకీయ పరిశీలకుల్లో ఉంది. అయితే జీవీఎంసీ నిధుల పరిమాణాన్ని వ్యక్తిగత లేదా రాజకీయ ప్రయోజనాలకు అనుసంధానించే ఆరోపణలు వస్తే అవి ఆధారాలతోనే నిర్ధారించాల్సి ఉంటుంది. ప్రత్యక్ష మేయర్ ఎన్నిక నేపథ్యంలో ప్రచార వ్యయం భారీగా పెరిగే అవకాశం ఉందన్న చర్చ రాజకీయ వర్గాల్లో మొదలైంది. ఇప్పటికే కార్పొరేటర్ స్థానాలకు పోటీ చేసే అభ్యర్థుల ఖర్చు కూడా గణనీయంగా ఉండొచ్చన్న అంచనాలు వినిపిస్తున్నాయి. అయితే ఒక్కో కార్పొరేటర్‌కు రూ.50 లక్షలు, మేయర్ అభ్యర్థికి రూ.100 కోట్ల వరకు ఖర్చవుతుందన్న సంఖ్యలు ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్న అంచనాలు మాత్రమే. ఇవి అధికారిక ఎన్నికల వ్యయ గణాంకాలు కావు. ఎన్నికల సంఘం నిర్దేశించే వ్యయ పరిమితులు, ఖర్చుల లెక్కలు, నిబంధనలే అధికారికంగా వర్తిస్తాయి. 120 వార్డుల నేపథ్యంలో ప్రధాన రాజకీయ పార్టీలు ఇప్పటి నుంచే బలమైన అభ్యర్థుల కోసం అన్వేషణ ప్రారంభించాయి. మేయర్ అభ్యర్థిగా ఎవరిని ప్రకటించాలనే అంశంలో పార్టీకి ఉన్న నగరవ్యాప్త బలం, అభ్యర్థి వ్యక్తిగత పరిచయాలు, సామాజిక సమీకరణాలు, ఆర్థిక సామర్థ్యం, స్థానిక నాయకత్వంతో సంబంధాలు వంటి అంశాలు చర్చకు వస్తున్నాయి. ఇప్పటికే టీడీపీ నేతృత్వంలోని కూటమి జీవీఎంసీ ఎన్నికల కోసం సమన్వయ వ్యూహాన్ని ప్రకటించింది. మూడు పార్టీలు వేర్వేరు గుర్తులపై పోటీ చేసినప్పటికీ కూటమిగా పనిచేస్తామని ఆ పార్టీలు తెలిపాయి. మేయర్ అభ్యర్థిని చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీ మాధవ్ నిర్ణయిస్తారని కూటమి నేతలు వెల్లడించారు. మరోవైపు వైఎస్సార్‌సీపీ కూడా వార్డుల సంఖ్య 120 అయినా, 150 అయినా ఎన్నికలకు సిద్ధమని ప్రకటించింది. అయితే వార్డుల పునర్విభజన ప్రక్రియ పారదర్శకంగా ఉండాలని ఆ పార్టీ నేతలు కోరారు.

**బలాబలాలు లెక్కలు..**

విశాఖ నగరంలో మేయర్ పదవికి ఉన్న ప్రాధాన్యత మరో ఆసక్తికరమైన రాజకీయ పరిణామానికి దారితీస్తోంది. నగరంలోని అసెంబ్లీ నియోజకవర్గాలపై ప్రభావం చూపగల నగరవ్యాప్త రాజకీయ నాయకత్వాన్ని మేయర్ పదవి అందించే అవకాశం ఉండటంతో కొందరు సీనియర్ నేతలు ఈ పదవిపై దృష్టి పెడుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే ఎమ్మెల్యేలు, మాజీ ప్రజాప్రతినిధుల కుటుంబ సభ్యులు, రాజకీయ వారసులు స్థానిక సంస్థల రాజకీయాల్లోకి రావాలనే ఆసక్తి చూపుతున్నారన్న చర్చ సాగుతోంది. అయితే ఎవరు నిజంగా మేయర్ రేసులో ఉంటారన్నది పార్టీలు అధికారికంగా అభ్యర్థులను ప్రకటించిన తర్వాతే స్పష్టమవుతుంది.

120 వార్డుల పునర్విభజన ప్రక్రియ రాజకీయంగా కూడా చర్చనీయాంశమైంది. ఈ ప్రక్రియపై గతంలో హైకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. మేలో కోర్టు మధ్యంతర స్టే ఇచ్చినప్పటికీ ఆగస్టులో డివిజన్ బెంచ్ ఆ స్టేను ఎత్తివేసింది. అనంతరం సెప్టెంబర్ 14న 120 వార్డుల తుది సరిహద్దులను ప్రభుత్వం ప్రకటించింది. అందువల్ల కొత్త వార్డుల్లో ఏ పార్టీకి ఎక్కడ బలం ఉంది? ఏ సామాజిక వర్గాల సమీకరణాలు ఎలా మారాయి? ఏ ప్రాంతాల్లో కొత్త నాయకత్వం ఎదుగుతోంది? వంటి అంశాలపై పార్టీలు ప్రత్యేకంగా లెక్కలు వేసే పరిస్థితి ఏర్పడింది.

**భారీ పొలిటికల్ స్కెచ్**

జీవీఎంసీ పరిధి, ఆర్థిక పరిమాణం, నగర అభివృద్ధి ప్రాజెక్టులు, రాజకీయ ప్రభావం---ఈ నాలుగు అంశాల కారణంగా మేయర్ పదవిపై పార్టీల ఆసక్తి పెరుగుతోంది. ముఖ్యంగా ప్రత్యక్ష ఎన్నికల విధానం అమల్లోకి రావడంతో మేయర్ అభ్యర్థి వ్యక్తిగత ఇమేజ్, నగరవ్యాప్త పరిచయాలు, ప్రచార సామర్థ్యం, పార్టీ ఓటు బేస్ కీలకంగా మారనున్నాయి. అందుకే జీవీఎంసీ ఎన్నికలు కేవలం 120 కార్పొరేటర్ స్థానాల కోసం జరిగే పోరుగా కాకుండా.. విశాఖ నగర రాజకీయ నాయకత్వాన్ని నిర్దేశించే పోరుగా రూపుదిద్దుకుంటున్నాయి. మేయర్ అభ్యర్థుల ఎంపికలో సామాజిక సమీకరణాలు, పార్టీ అంతర్గత సమన్వయం, కూటమి భాగస్వామ్యాలు, స్థానిక నాయకుల మధ్య పోటీ, ప్రచార వనరులు---ఇవన్నీ ప్రధాన పార్టీలకు పరీక్షగా మారనున్నాయి. ముఖ్యంగా ప్రత్యక్ష మేయర్ ఎన్నికలో నగరవ్యాప్తంగా ఓటర్లను నేరుగా కలవాల్సి రావడంతో "ఎవరు మేయర్?" కంటే "ఎవరిని నగర ప్రజల ముందుకు తీసుకురావాలి?" అన్న ప్రశ్నే పార్టీలకు కీలకంగా మారనుంది. అందుకే జీవీఎంసీ మేయర్ పీఠం కోసం ఇప్పటి నుంచే మొదలైన కసరత్తు.. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే నాటికి మరింత ఉత్కంఠభరితంగా మారే అవకాశముంది.

# పేదల కల సాకారం

**372 మందికి పట్టాలు పంపిణీ**

**మంగళగిరిలో అందజేసిన మంత్రి లోకేశ్**

(మంగళగిరి - జయజయహే)



మంగగిరి నియోజకవర్గంలో ఇల్లు లేని నిరుపేదలు కొందరికి లబ్ధి చేకూరింది. 372 మంది లబ్ధిదారులకు ఉచితంగా శాశ్వత ఆస్తి హక్కుల పట్టాలను మంత్రి నారా లోకేష్ పంపిణీ చేశారు. మంగళగిరి నియోజకవర్గంలోని కుంచనపల్లిలో నిర్వహించిన 'మన ఇల్లు -- మన లోకేశ్' కార్యక్రమంలో రాష్ట్ర విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ పాల్గొన్నారు. ఇప్పటికే రెండు విడతల్లో భాగంగా 5,636 మందికి పట్టాలు అందించగా, తాజా పంపిణీతో కలిపి దాదాపు రూ.2,000 కోట్ల విలువైన భూములకు సంబంధించిన పట్టాలను కూటమి ప్రభుత్వం నిరుపేదలకు అందించినట్లయింది. ప్రస్తుతం మంగళగిరి నియోజకవర్గంలో దాదాపు 80 శాతం మేర ఉన్న ఇళ్ల పట్టాల సమస్యలను పరిష్కరించినట్లు ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు. అలాగే కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉన్న భూములకు సంబంధించిన వివాదాల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం సంప్రదింపులు జరుపుతుందని తెలిపారు. 2029 నాటికి నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ శాశ్వత ఆస్తి హక్కుల పట్టాలు అందిస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది.

# సీటు.. హీటు..!

మొదటి పేజీ తరువాయి...

ప్లాన్ చేస్తుండగా, అభ్యర్థులు రాజకీయ వ్యూహాలకు పదును పెడుతున్నారు.గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) మేయర్ పీఠం మరోసారి విశాఖ రాజకీయాల కేంద్రబిందువుగా మారుతోంది. 98 వార్డుల నుంచి 120 వార్డులకు జీవీఎంసీ విస్తరించడంతో నగర రాజకీయ భౌగోళికత మారిపోయింది. తాజాగా 120 వార్డుల తుది విభజనను ప్రభుత్వం గెజిట్‌లో ప్రకటించింది. కొత్త వ్యవస్థలో భీమిలి, మధురవాడ, ఈస్ట్, సౌత్, నార్త్, వెస్ట్, గాజువాకతో పాటు అగనంపూడి, అనకాపల్లి, పెందుర్తి ప్రాంతాలు కూడా కొత్త వార్డు నిర్మాణంలో ఉన్నాయి. ఇదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్పొరేషన్ల మేయర్లను ప్రత్యక్ష పద్ధతిలో ఎన్నుకునే నిబంధనలను జారీ చేసింది. అంటే ఇక మేయర్ ఎన్నిక కేవలం కార్పొరేటర్ల మధ్య జరిగే రాజకీయ సమీకరణాలకు పరిమితం కాకుండా.. మొత్తం కార్పొరేషన్ పరిధిలోని ఓటర్లను ఆకర్షించే స్థాయికి చేరింది. ఈ మార్పు జీవీఎంసీ మేయర్ పదవికి రాజకీయంగా మరింత ప్రాధాన్యత తీసుకొచ్చింది. ఇప్పటివరకు మేయర్ ఎంపికలో కార్పొరేటర్ల బలం, పార్టీ అంతర్గత సమీకరణాలు కీలకంగా ఉండేవి. ప్రత్యక్ష ఎన్నికల విధానంతో పరిస్థితి మారనుంది. మేయర్ అభ్యర్థి నగరంలోని వివిధ ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించాల్సి ఉంటుంది. సామాజిక వర్గాలు, ప్రాంతీయ సమీకరణాలు, యువత, మహిళలు, స్థానిక సమస్యలు వంటి అంశాలు అభ్యర్థుల విజయావకాశాలను ప్రభావితం చేసే అంశాలుగా మారనున్నాయి. దీంతో మేయర్ అభ్యర్థి ఎంపిక అనేది కేవలం ఒక వ్యక్తిని ఎంపిక చేసే ప్రక్రియ కాకుండా.. మొత్తం నగరానికి పార్టీ తరఫున రాజకీయ ముఖచిత్రాన్ని నిర్ణయించే అంశంగా మారింది.

# 1/70 చట్టంపై సుప్రీంకు గిరిజనం

మొదటి పేజీ తరువాయి...

దిగారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 244, 19(5), ఐదవ షెడ్యూల్‌లోని పేరా 5, 5(2) ఆధారంగా గిరిజనులకు లభించిన ప్రత్యేక రక్షణలను కాపాడాలని వర్ష రాంబాబు, ఆధార్ సొసైటీ సభ్యులతో కలిసి 2,500 మంది గిరిజనులు ఈ పిటిషన్ దాఖలు చేశారు. గిరిజన ప్రాంతాల్లో భూ బదలాయింపులను నియంత్రించి, ఆదివాసీలను ఆర్థిక దోపిడీ నుంచి రక్షించడమే ఈ చట్టాల ప్రధాన ఉద్దేశమని వారు పిటిషన్‌లో పేర్కొన్నారు.

**1/70 చట్టం, 1988 నాటి చారిత్రాత్మక తీర్పు**

ఈ చట్టపరమైన సవాలు ప్రధానంగా 'ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ ప్రాంతాల భూ బదలాయింపు నియంత్రణ చట్టం' (1/70 యాక్ట్)పై ఆధారపడి ఉంది. గతంలో సుప్రీంకోర్టు వెలువరించిన 'పి. రామిరెడ్డి వర్సెస్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం (1988) 3 ఎస్‌సీసీ 433' కేసులోని తీర్పు మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలని ఆదివాసీలు కోరుతున్నారు. గిరిజన ప్రాంతాల్లో గిరిజనేతరులకు జరిగే భూ బదలాయింపులపై సంపూర్ణ నిషేధం విధించడం గిరిజనుల సామాజిక-ఆర్థిక మనుగడకు అత్యవసరమని ఆనాడు సుప్రీంకోర్టు సమర్థించింది. 1978లోని 44వ రాజ్యాంగ సవరణ ద్వారా ఆర్టికల్ 19(1)(ట) కింద ఉన్న ఆస్తి ప్రాథమిక హక్కును రద్దు చేశారని, కేవలం గిరిజనులకు మాత్రమే ఆర్టికల్ 244, 19(5), 5వ షెడ్యూల్ కింద ప్రత్యేక హక్కులు ఉన్నాయని 1988 తీర్పులోనే అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసినట్లు పిటిషనర్లు గుర్తుచేశారు.

**గిరిజన భూములకు ప్రత్యేక రక్షణ ఎందుకు?**

గిరిజనులు తరతరాలుగా అటవీ ప్రాంతాల్లో నివసిస్తున్నారు. భూమి వారి దృష్టిలో కేవలం ఒక ఆర్థిక వనరు మాత్రమే కాదు; తమ జీవన విధానం, కుటుంబ పోషణ, సంస్కృతి, గుర్తింపుతో ముడిపడి ఉన్న సహజ వనరు. 1874 నుంచి 1950 మధ్య కాలంలో నిరక్షరాస్యత, పేదరికం, చట్టాలపై అవగాహన లేకపోవడం వల్ల గిరిజనులు భూస్వాములు, వడ్డీ వ్యాపారులు, గిరిజనేతర వలసదారుల చేతిలో తీవ్రంగా మోసపోయారు. ఈ పరిస్థితుల నుంచి అమాయక గిరిజనులను కాపాడేందుకే ప్రభుత్వం 1/1959 రెగ్యులేషన్, ఆ తర్వాత సవరించిన 1/70 రెగ్యులేషన్ ద్వారా రాజ్యాంగబద్ధ రక్షణ కల్పించింది. ఈ చట్టం గిరిజనుల అభ్యున్నతికి ఉద్దేశించినదే తప్ప 1970కి ముందు ఉన్న గిరిజనేతరులకు వ్యతిరేకం కాదు. 1970కి పూర్వం ఏజెన్సీలో ఉన్న గిరిజనేతరులు తమ వారసత్వ భూములను జిల్లా కలెక్టర్ అనుమతితో బదిలీ చేసుకునే ప్రత్యేక వెసులుబాటు కూడా ఈ చట్టంలో ఉంది.

**'సుప్రీంకోర్టును తప్పుదోవ పట్టించే యత్నం'**

1970 తర్వాత గిరిజన ప్రాంతాలకు అక్రమంగా వలస వచ్చిన కొందరు గిరిజనేతరులు, వడ్డీ వ్యాపారులు గిరిజనుల పట్టా భూములు, ప్రభుత్వ అసైన్‌మెంట్ భూములు, మిగులు భూములను ఆక్రమించారని పిటిషనర్లు ఆరోపించారు. ప్రస్తుతం యారంశెట్టి సత్యనారాయణ దాఖలు చేసిన పిటిషన్ (ఫ్లా చీశీ. 696/2026), సూరిరెడ్డి రమణారెడ్డి దాఖలు చేసిన సివిల్ అప్పీల్ (చీశీ. 394/2023) ద్వారా రద్దయిన ఆర్టికల్ 19(1)(ట)ను ఆధారంగా చూపిస్తూ 1/70 చట్టంలోని సెక్షన్ 3(1)(ఘ)ను రద్దు చేయాలని కోరడం సుప్రీంకోర్టును తప్పుదోవ పట్టించడమేనని స్పష్టం చేశారు. ఈ అక్రమ పిటిషన్లను వెంటనే కొట్టివేసి గిరిజన భూములకు సంపూర్ణ రక్షణ కల్పించాలని 2,500 మంది ఆదివాసీలు అత్యున్నత న్యాయస్థానాన్ని అభ్యర్థించారు.

# మానసిక స్థైర్యంతో మహిళల సత్తా చాటండి





### శిక్షణ మహిళా కానిస్టేబుళ్లకు హోం మంత్రి అనిత పిలుపు

### శిక్షణ పూర్తిచేసుకున్న 473 మంది మహిళా కానిస్టేబుల్స్

**విజయనగరం జయజయహే**

శారీరక ధారుడ్యాన్ని పెంచుకోవడంతోపాటు మానసిక స్థైర్యంతో ముందడుగు వేయాలని, విధి నిర్వహణలో ఎన్నడూ వెనుదిరగక మహిళల సత్తా చూపాలని శిక్షణ పూర్తి చేసుకున్న మహిళా కానిస్టేబుళ్లకు రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత పిలుపునిచ్చారు. సోమవారం విజయనగరం పోలీస్ శిక్షణా కళాశాలలో శిక్షణ పూర్తిచేసుకున్న 2025-26 బ్యాచ్ కు చెందిన 473 మంది మహిళా కానిస్టేబుళ్ల పాసింగ్ అవుట్ పరేడ్ లో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మహిళా కానిస్టేబుళ్ల గౌరవ వందనాన్ని స్వీకరించారు. పెరేడ్‌ను తిలకించారు. శిక్షణలో మెరుగైన ప్రతిభను కనపరిచిన కేడెట్స్‌కు జ్ఞాపికలను అందజేశారు. శాంతికపోతాలను ఎగురవేశారు. పిటిసిలో కొత్తగా నిర్మించిన కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించారు. శిక్షణ పూర్తిచేసుకున్న మహిళా కానిస్టేబుళ్లు ఈ సందర్భంగా సామూహికంగా ప్రమాణస్వీకారం చేశారు. కేడెట్స్‌తో, వారి తల్లితండ్రులతో మంత్రి మమేకమై మాట్లాడారు. అనంతరం ఆమె మహిళా కానిస్టేబుళ్లనుద్దేశించి మాట్లాడుతూ, పోలీస్ వ్యవస్థకు కానిస్టేబుల్స్ వెన్నుముక అని పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళా కానిస్టేబుల్‌గా ఉంటే, స్టేషన్‌కు భయంతో వచ్చే బాధిత మహిళలుకు మరింత ధైర్యంగా ఉంటుందని పేర్కొన్నారు. మహిళలు, బాలికల రక్షణ వీరిపై ఉంటుందన్నారు. 9 నెలల కఠిన శిక్షణ జీవితానికి పునాదిలాంటిదని అన్నారు. పోలీసు ఉద్యోగమంటేనే ఎంతో బాధ్యతతో కూడినదని, సమాజంలో ఎంతో ప్రభావవంతమైనదని తెలిపారు. పోలీసుల వల్లే రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపులో ఉన్నాయని, దానివల్లే రాష్ట్రానికి పెట్టుబడులు వరదలా వస్తున్నాయని అన్నారు. అందువల్ల పోలీసు శాఖకు ముఖ్యమంత్రి అత్యధిక ప్రాధాన్యతనిస్తూ, నియామకాలు చేపట్టడమే కాకుండా, శిక్షణలో కేడెట్స్‌కు ఇచ్చే స్టైఫండ్‌ను రూ.12వేలకు పెంచారని చెప్పారు. ఒకవైపు కుటుంబ బాధ్యతలను నిర్వర్తిస్తూ, మరోవైపు ఉద్యోగ బాధ్యతలను కూడా నిర్వర్తించడం ఎంతో కష్టమని, అది మహిళలకు మాత్రమే సాధ్యమవుతుందని అన్నారు. కానిస్టేబుల్ ఉద్యోగానికి పంపించిన వారి తల్లితండ్రులను, కుటుంబ సభ్యులను ఈ సందర్భంగా మంత్రి అభినందించారు. వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, వేసుకున్న యూనిఫాంకు మరింత గౌరవం వచ్చే విధంగా, ప్రభుత్వ ప్రతిష్టను పెంచేవిధంగా పనిచేయాలని మంత్రి కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు , జిల్లా కలెక్టర్ ఎస్ రాంసుందర్ రెడ్డి, జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్,ఐపిఎస్, ఎమ్మెల్సీలు గాదె శ్రీనివాసుల నాయుడు, ఇందుకూరి రఘురాజు, విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు, పీటీసీ ప్రిన్సిపాల్ డి.రామచంద్ర రాజు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.కోటేశ్వరబాబు, అడిషనల్ ఎస్పిలు సిహెచ్ శ్రీకాంత్, ఎస్.వాసుదేవ్, డిఎస్పిలు, సిఐలు, ఇతర అధికారులు, కేడెట్స్ తల్లితండ్రులు పాల్గొన్నారు.



## టిడ్కో గృహ సముదాయాన్ని పరిశీలించిన గంటా

**మధురవాడ,జయ జయహే ; జీవిఎంసీ 6 వార్డు**

కొమ్మాది టిడ్కో గృహ సముదాయాన్ని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సోమవారం సందర్శించారు. ఈ ఇళ్లలో దిగే వారికి అసౌకర్యం కలగకుండా మౌలిక వసతులు సిద్ధం చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. డ్రెయిన్లు, విద్యుత్ మీటర్లు వంటి సదుపాయాలను పరిశీలించారు. అర్హులైన అందరికీ ఆవాసాలు కల్పించాలనే ప్రభుత్వ ఆశయంలో భాగంగా నగర పరిసరాల్లో ఉంటున్న వారికి స్థానికంగానే టిడ్కో ఇళ్లు కేటాయిస్తున్నామని చెప్పారు. ఇప్పటికే సివిల్ సహా విద్యుత్, ప్లంబింగ్, పెయింటింగ్ పనులు పూర్తయ్యాయన్నారు. అమరావతి నగర్ వద్ద బురదమయంగా ఉన్న రోడ్డు రాకపోకలకు వీలుగా అభివృద్ధి చేయాలని సూచించారు. జోనల్ కమిషనర్ వి.అయ్యప్ప నాయుడు, ఏపీడీ శ్రీరాం, నాయకులు నాగోతి సత్యనారాయణ, మొల్లి లక్ష్మణరావు, కానూరు అచ్యుతరావు, గరే గుర్నాథ్, బోయి శ్రీను, పోతిన శివ తదితరులు పాల్గొన్నారు.



## ప్రజా ఫిర్యాదులను పరిష్కారానికి చొరవ చూపాలి

### జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి

**పార్వతీపురం మన్యం జయజయహే**

సమస్యలపై ప్రజలు అందించే ఫిర్యాదుల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి ఆధికారులను ఆదేశించారు . సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు . జిల్లా ఎస్పీ ఎస్.వి. మాధవ్ రెడ్డి కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి స్వయంగా వినతులను స్వీకరించారు.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ వ్యక్తిగత, కుటుంబ, భూ వివాదాలు, ఆస్తి తగాదాలు, వేధింపులు, మోసాలు, ఇతర సమస్యలకు సంబంధించి తమ ఫిర్యాదులను జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి ఫిర్యాదుదారుడి సమస్యను స్వయంగా తెలుసుకున్నారు. వినతులను పరిశీలించి సంబంధిత పోలీస్ అధికారులుతో ఫోన్లో మాట్లాడి చట్టపరమైన నిబంధనల ప్రకారం నిష్పక్షపాతంగా విచారణ చేపట్టి, అర్హత ఉన్న సమస్యలకు త్వరితగతిన పరిష్కారం చూపించాలని ఆదేశించారు. ఫిర్యాదులపై తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికను ఇవ్వాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 8 ఫిర్యాదులు అందాయి.ఈ కార్యక్రమంలో ఎస్పీ తో పాటుగా అదనపు ఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు, డిసిఆర్బీ సిఐ జి.ఏ.వి.రమణ, ఎస్సై అశోక్ చక్రవర్తి, శిరీష మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## తండ్రి శోభన్ బాబు బాటలోనే కరుణ్ శేషు

**భీమవరం ; (జయ జయహే)**



తెలుగు చలనచిత్ర పరిశ్రమలో తనదైన నటనతో అందంతో కోట్ల మంది అభిమానుల హృదయాలను గెలుచుకున్న నటభూషణ్ శోభన్ బాబు అని, వారి కుమారుడు కరుణ శేషు పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని కోరుకుంటున్నామని అఖిల భారత శోభన్ బాబు సేవా సమితి కన్వీనర్ భట్టిప్రోలు శ్రీనివాసరావు అన్నారు. సోమవారం వారి పుట్టినరోజు సందర్బంగా శుభాకాంక్షలు తెలియజేశారు. కరుణ శేషు కూడా తన తండ్రి శోభన్ బాబు నేర్పిన క్రమశిక్షణ, నిరాడంబరత్వంతోనే పెరిగారన్నారు. కరుణ శేషు రూపం, ఆహార్యం చాలా వరకు శోభన్ బాబుని తలపిస్తాయని అన్నారు. కరుణ్ శేషు మరెన్నో పుట్టినరోజు వేడుకలను జరుపుకోవాలని అభిమానులుగా కోరుకుంటున్నామని భట్టిప్రోలు శ్రీనివాసరావు అన్నారు.

## దేవరాపల్లిలో నార్కోటిక్ ట్రాకింగ్ డాగ్ తో తనిఖీలు

**దేవరాపల్లి, సెప్టెంబర్ 28, జయ జయహే**

స్థానిక ఎస్ఐ వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో సోమవారం నార్కోటిక్ ట్రాకింగ్ డాగ్ తో దేవరాపల్లి పరిసర ప్రాంతాల్లోని చెక్ పోస్ట్, ఆర్టీసీ కాంప్లెక్స్, నాలుగు రోడ్ల జంక్షన్ తదితర ప్రాంతాల్లో గంజాయి కోసం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ నార్కోటిక్ ట్రాకింగ్ డాగ్ సహాయంతో సడన్ సర్ప్రైస్ గా వాహనాలు, పలు ప్రాంతాలు తనిఖీ చేయడం జరిగిందని ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.






## మేజిక్ స్టార్ బోస్‌కు 'మాయా కళానిధి' అవార్డు

**ఖమ్మం (జయ జయహే)**




ఆంధ్ర ప్రదేశ్ మెజీషియన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఖమ్మం నగరంలో 'మాయాబజార్ 2' పేరున మేజిక్ ఫెస్టివల్ జరిగిన సందర్భంగా ప్రఖ్యాత ఇంద్రజాలికుడు, రచయిత మేజిక్ స్టార్ డా. బోస్‌ను 'మాయా కళానిధి' బిరుదుతో నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. అవార్డునూ, సన్మాన పత్రాన్నీ ఆయనకు అందజేశారు. విభిన్న కార్యకలాపాలతో మేజిక్ రంగంలో 'మల్టీ టాలెంటెడ్ మెజీషియన్'గా రాణిస్తూ, మేజిక్ రంగానికి బోస్ అందిస్తున్న విశిష్ట సేవలను అధ్యక్షుడు జె. వెంకటేశ్వర రావు, నిర్వాహక కార్యదర్శి డా. కె.వి.వి.వి. కుమార్ ప్రశంసించారు. రెండు తెలుగు రాష్ట్రాల నుండి సుమారు 200 మంది మెజీషియన్లు పాల్గొన్న నాటి మేజిక్ ఉత్సవంలో మేజిక్ క్లాసులు, మేజిక్ పోటీలు జరిగాయి. విజేతలకు బహుమతి ప్రదానాలు జరిగాయి. అయిదుగురు సీనియర్ మెజీషియన్‌లను నగదు బహుమతితో కూడిన 'మేజిక్ స్టార్' అవార్డులతో బోస్ సత్కరించారు.



## మత్తు పదార్థాల రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక తనిఖీలు

**పార్వతీపురం మన్యం జయజయహే**

మత్తు పదార్థాల రవాణ అడ్డుకట్ట వేసేందుకు అధికారులు ముమ్మర చర్యలు చేపడుతున్నారు . సోమవారం రాయగడ - గుంటూరు ఎక్స్ప్రెస్ రైలులో పార్వతీపురం రైల్వే స్టేషన్ నుంచి గజపతినగరం రైల్వే స్టేషన్ వరకు జిల్లా తనిఖీలు చేపట్టారు .సిసిఎస్ , ఈగల్ టీం, పార్వతీపురం రూరల్ పోలీస్, జీఆర్పీ, ఆర్పీఎఫ్, పోలీస్ జాగిలాల బృందాలతో కలిసి సంయుక్తంగా తనిఖీలు చేపట్టారు . రైలులోని ప్రతీ బోగీలు, ప్రయాణికుల సామగ్రిని అనుమానస్పద వ్యక్తులను డాగ్ స్క్వాడ్ సహాయంతో క్షుణ్ణంగా పరిశీలిస్తూ మత్తు పదార్థాల అక్రమ రవాణాపై నిఘా పెట్టారు. ఈ తనిఖీలలో ఎటువంటి మత్తు పదార్థాలు దొరకలేదు. సిసిఎస్ సిఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం ప్రజలను,యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడేందుకు, మత్తు పదార్థాల రవాణా, అక్రమ రవాణాను అరికట్టేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు . ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తనిఖీలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు . జిల్లాలో రైళ్లు, బస్సులు తదితర ప్రజా రవాణా మార్గాల్లో ఆకస్మిక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు. ప్రజలు కూడా అనుమానాస్పద వ్యక్తులు లేదా మత్తు పదార్థాల అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే ఏపీ ఈగల్ టోల్ ఫ్రీ నెంబర్ 1972 కు, దగ్గరలో గల పోలీస్ స్టేషన్లుకు,112 కి సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. సమాచారం ఇచ్చే వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని హామీ ఇచ్చారు.ఈ ఆపరేషన్‌లో ఈగల్ సెల్ ఎస్ఐ భాస్కరరావు, పార్వతీపురం రూరల్ ఎస్సై రాజేష్, పోలీసు సిబ్బంది, జీఆర్పీ, ఆర్పీఎఫ్, డాగ్ స్క్వాడ్ బృందాలులి పాల్గొన్నాయి.

# వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి 35 కుటుంబాలు

## కండువా కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

**కొయ్యూరు (జయ జయహే న్యూస్) సెప్టెంబర్ 29,**

కొయ్యూరు మండలం నడింపాలెం పంచాయతీ బద్ధిమెట్ట గ్రామంలో శాసనసభ్యులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మత్స్యరాస విశ్వేశ్వరరాజు పర్యటించారు.వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులై బద్ధిమెట్ట గ్రామానికి చెందిన బీజేపీ, టీడీపీ పార్టీల నుండి మాజీ వైస్ సర్పంచ్ దూరి రాజబాబు, వార్డు సభ్యులు పండ చిట్టిబాబుంతో పాటు 35 కుటుంబాలు ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు మాట్లాడుతూచంద్రబాబు, కూటమి నాయకులు అధికారం కోసం వంద అబద్ధాలు చెప్పి గద్దెనెక్కారని, ఇచ్చిన హామీలను అమలు చేయకుండా అసత్య ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. ఆ పార్టీలపై నమ్మకం పోయి, గత ప్రభుత్వంలో జగన్మోహన్ రెడ్డి గారు ఇచ్చిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై రోజురోజుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి చేరుతున్నారని అన్నారు.రెండేళ్లు ఓపిక పట్టండి, మన ప్రభుత్వం వస్తుంది, జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకుందాం, గ్రామాలను అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు. మీకు ఎప్పుడూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ



అండగా ఉంటుందని భరోసా కల్పించారు.ఈ కార్యక్రమంలో కొయ్యూరు మండల అధ్యక్షులు బిడిజన అప్పారావు, మాజీ ఎంపీపీ బడుగు రమేష్, రాష్ట్ర యువజన విభాగం జాయింట్ సెక్రటరీ అచ్యుత్, జిల్లా ఉపాధ్యక్షులు గాడి సత్యనారాయణ, విద్యార్థి విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ రీమల గంగాధర్, మాజీ జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు గొడ్డేటి మహేష్, మాజీ వైస్ ఎంపీపీలు అప్పన వెంకటరమణ, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు జల్లి బాబులు, జీకే వీధి మండల పార్టీ అధ్యక్షుడు గిరి, శరభన్నపాలెం మాజీ సర్పంచ్ కిముడు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# పెంపకం లోపమా? పరిస్థితుల ప్రభావమా?

## మారుతున్న కుటుంబాలు, పెరుగుతున్న ఒత్తిళ్లు, యువత ప్రవర్తనపై ఒక పరిశీలన

**ఒక యువకుడు ఆన్‌లైన్ ఆటల కోసం అప్పులు చేశాడని, ప్రేమను అంగీకరించలేదనే కారణంతో కుటుంబంలో హింస జరిగిందని, మాదకద్రవ్యాలకు అలవాటుపడిన విద్యార్థి భవిష్యత్తు దెబ్బతిందని వార్తలు వచ్చినప్పుడు మనం అడిగే ప్రశ్న ఒకటే: ఇది పెంపకం లోపమా, పరిస్థితుల ప్రభావమా? ఈ రెండింటిలో ఒక్కదానిని నిందించడం సులభం. కానీ పిల్లల ప్రవర్తన కుటుంబంలో మొదలై, పాఠశాల, స్నేహితులు, ఆర్థిక పరిస్థితులు, మీడియా, సామాజిక విలువల మధ్య రూపుదిద్దుకుంటుంది. అందువల్ల పరిష్కారాన్ని కూడా అన్ని స్థాయిల్లో వెతకాలి.**




ముందుగా ఒక విషయం గుర్తించాలి. నేటి యువత అంతా పెద్దల మాట వినడం లేదనీ, విలువలను కోల్పోయిందనీ చెప్పడం అన్యాయం. ఎంతోమంది యువతీయువకులు బాధ్యతగా చదువుతున్నారు, కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు, సమాజానికి సేవ చేస్తున్నారు. అయితే అప్పులు, వ్యసనాలు, మోసాలు, సంబంధాల్లో హింస వంటి సమస్యలు ఎదురైనప్పుడు వాటి వెనుక ఉన్న పరిస్థితులను నిశితంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది.

### కుటుంబం మారింది; అనుబంధం కూడా మారిందా?

ఉమ్మడి కుటుంబాల్లో పిల్లలకు తల్లిదండ్రులతోపాటు తాతలు, అమ్మమ్మలు, బాబాయిలు, పిన్నిలతో సంభాషించే అవకాశం ఉండేది. కథలు వినడం, విభిన్న అభిప్రాయాలను ఎదుర్కోవడం, చిన్నపాటి నిరాశలను తట్టుకోవడం వంటి అనుభవాలు రోజువారీ జీవితంలోనే లభించేవి. నేడు ఉద్యోగాలు, వలసలు, నివాస వ్యయం తదితర కారణాలతో చిన్న కుటుంబాలు పెరిగాయి. ఈ మార్పును తప్పుగా చూడలేం. చిన్న కుటుంబం కూడా ప్రేమతో, క్రమశిక్షణతో పిల్లలను పెంచగలదు.

సమస్య కుటుంబ పరిమాణంలో కన్నా కలిసి గడిపే సమయం, మాట్లాడే విధానం, అవసరమైనప్పుడు అందుబాటులో ఉండడంలో ఎక్కువగా ఉంటుంది. తల్లిదండ్రులు పని ఒత్తిడితో అలసిపోయి ఇంటికి చేరినప్పుడు పిల్లల అవసరాలను వస్తువులతో తీర్చాలని భావించవచ్చు. మరోవైపు, కొందరు పిల్లలతో మాట్లాడే ప్రతి సందర్భాన్నీ మార్కులు, ఉద్యోగం, ఇతరులతో పోలికల చుట్టూ తిప్పుతారు. అప్పుడు పిల్లవాడు తన భయాన్ని, తప్పును లేదా ప్రేమ సంబంధాన్ని ఇంట్లో చెప్పడానికి వెనుకాడవచ్చు.

అతిగారాబం కూడా ఒక సవాలు. పిల్లల ప్రతి కోరికను వెంటనే తీర్చడం వల్ల డబ్బు విలువ, నిరీక్షణ, తిరస్కరణను ఎదుర్కొనే శక్తి నేర్చుకునే అవకాశాలు తగ్గవచ్చు. అయితే ప్రేమను చూపడం అతిగారాబం కాదు. ప్రేమతోపాటు స్పష్టమైన హద్దులు పెట్టడం, నిర్ణయాల ఫలితాలను వివరించడం, వయసుకు తగిన బాధ్యతలు అప్పగించడం పెంపకంలో ముఖ్యమైన భాగాలు.

### డబ్బు, హోదా, ఇతరులతో పోలిక

ఆర్థిక ఉదారీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణకు సంబంధించిన భారతదేశ ప్రధాన సంస్కరణలు 1991లో ప్రారంభమయ్యాయి; తరువాతి సంవత్సరాల్లో వాటి ప్రభావం విస్తరించింది. సేవారంగం, ఐటీ ఉద్యోగాలు, కొత్త వ్యాపారాలు అనేక కుటుంబాలకు ఆదాయ అవకాశాలను తెచ్చాయి. జూఅవె.స్త్రశీజ.అఅ రియల్ ఎస్టేట్ వంటి రంగాల్లో కొందరికి వేగంగా సంపద సమకూరింది. ఆర్థిక పురోగతి స్వయంగా సమస్య కాదు; సంపాదనతోపాటు ఖర్చు, బాధ్యత, పొదుపు గురించి మాట్లాడకపోవడమే సమస్య కావచ్చు.

'పక్కింటివారు కొన్న కారు మనకూ కావాలి', 'వారి పిల్లలంత ఘనంగా వేడుక చేయాలి' అనే ఒత్తిడి పెద్దల నుంచే మొదలవుతుంది. హోదా ప్రదర్శన కోసం అప్పులు చేయడం సాధారణమని పిల్లలు ఇంట్లో చూస్తే, తమ అవసరాలకూ అప్పు తీసుకోవడాన్ని తేలికగా భావించే ప్రమాదం ఉంది. యాప్ రుణాలు, తక్షణ కొనుగోలు సౌకర్యాలు ఈ నిర్ణయాన్ని మరింత సులభం చేస్తాయి. చిన్న వయసు నుంచే ఆదాయం, వడ్డీ, అప్పు, మోసపూరిత ప్రకటనల గురించి నేర్పాలి.

### తెరలు చూపే ప్రపంచం, ఇంట్లో జరిగే సంభాషణ

మీడియా, సామాజిక మాధ్యమాలు యువతకు విజ్ఞానం, సృజనాత్మకత, కొత్త అవకాశాలు అందిస్తున్నాయి. అదే సమయంలో నిరంతర పోలికలు, విలాసవంతమైన జీవిత ప్రదర్శన, త్వరగా ధనవంతులు కావాలనే సందేశాలు ప్రలోభాలకు గురుచేయొచ్చు. ఆన్‌లైన్ ఆటల్లో ఖర్చు, అపరిచితులతో పరిచయాలు, రుణ యాప్‌ల ప్రచారం వంటి విషయాలపై కుటుంబంలో బహిరంగంగా మాట్లాడాలి. కేవలం ఫోన్ లాక్కోవడం కన్నా, పిల్లవాడు దానిని ఎలా ఉపయోగిస్తున్నాడో తెలుసుకుని తగిన హద్దులను కలిసి నిర్ణయించడం ఉపయోగకరం.

పాశ్చాత్య సంస్కృతిని అన్ని సమస్యలకు మూలంగా చూపడమూ సరైంది కాదు. వ్యక్తిగత స్వేచ్ఛ, సమానత్వం, గోప్యత వంటి భావాలపై యువత ఆసక్తి చూపడం సహజం. భారతీయ సంస్కృతిలోని కుటుంబ అనుబంధం, అతిథి మర్యాద, భాషా వైవిధ్యం, కళలు, సాహిత్యం కూడా విలువైనవే. పిల్లలకు ఈ సంప్రదాయాల అర్థం వివరించకుండా కేవలం 'పాటించాలి' అని ఆదేశిస్తే, అవి వారికి భారంగా అనిపించవచ్చు. కథలు, ఇతిహాసాలు చదవడం లేదా వినిపించడం సంభాషణకు మంచి మార్గం; వాటిలోని నిర్ణయాలు, సందేహాలు, నైతిక సంఘర్షణల గురించి ప్రశ్నించేందుకు కూడా అవకాశం ఇవ్వాలి.

### ప్రేమ, వివాహం, పరువు: హింసకు చోటు లేదు

ప్రేమ సంబంధం, ప్రేమ వైఫల్యం లేదా వివాహంపై భిన్నాభిప్రాయం ఉండడం నేరం కాదు. ప్రేమ వివాహం అయినా, పెద్దలు కుదిర్చిన వివాహం అయినా దాని విజయాన్ని ఒక్క పద్ధతే నిర్ణయించదు. పరస్పర గౌరవం, సమ్మతి, బాధ్యత, సమస్యలను మాట్లాడుకుని పరిష్కరించే సామర్థ్యం అవసరం. సంబంధం కొనసాగించనని చెప్పే వ్యక్తి నిర్ణయాన్ని గౌరవించడం కూడా నేర్పాలి.

ప్రేమను అడ్డుకున్నారనే కారణంతో కుటుంబ సభ్యులను హింసించడం, 'పరువు' పేరిట జంటలపై దాడి చేయడం, డబ్బు లేదా మరొక సంబంధం కోసం జీవిత భాగస్వామిని హత్య చేయడం---ఇవన్నీ తీవ్రమైన నేరాలు. వాటిని 'ప్రేమ వల్ల జరిగింది' అని తేలిక చేయకూడదు. కుటుంబాల్లో కోపాన్ని అదుపు చేయడం, తిరస్కరణను అంగీకరించడం, విభేదించినా ఎదుటివారి స్వేచ్ఛను గౌరవించడం నేర్పాలి. బెదిరింపులు కనిపించినప్పుడు బాధితులకు రక్షణ, న్యాయ సహాయం అందాలి.

### వ్యసనం లేదా సంక్షోభం ఎదురైతే

గంజాయి, మద్యం, ఇతర మాదకద్రవ్యాలు, ఆన్‌లైన్ ఆటలు లేదా అప్పుల సమస్యలో చిక్కుకున్న యువకుడిని అవమానించడం వల్ల అతను మరింత ఒంటరిగా మారవచ్చు. సమస్యను గుర్తించి, ప్రశాంతంగా మాట్లాడి, అవసరమైతే వైద్యులు, మానసిక ఆరోగ్య నిపుణులు, వ్యసన చికిత్స సేవల సహాయం పొందాలి. అప్పులు తీర్చలేక ఆత్మహత్య ఆలోచనలు వ్యక్తం చేస్తే వాటిని బెదిరింపుగా కొట్టిపారేయకుండా వెంటనే భద్రత, సహాయం కల్పించాలి. కౌమారదశలో కుటుంబం, పాఠశాల, సమాజం అందించే మద్దతు మానసిక ఆరోగ్యానికి ముఖ్యమని ప్రపంచ ఆరోగ్య సంస్థ పేర్కొంటుంది.

స్త్రీలపై లైంగిక హింస లేదా ప్రేమ పేరిట మోసాలను చర్చించేటప్పుడు బాధ్యతను బాధితుల దుస్తులు, సంచారం, స్వేచ్ఛపై మోపకూడదు. సమ్మతి అంటే ఏమిటి, వ్యక్తిగత హద్దులు ఎలా గౌరవించాలి, వేధింపులకు ఎలాంటి చట్టపరమైన పరిణామాలు ఉంటాయి అనే విషయాలు బాలురు, బాలికలు అందరూ నేర్చుకోవాలి.

### నివారణ ఇంటి నుంచి మొదలై సమాజం వరకు సాగాలి

కుటుంబంలో: రోజూ కొంత సమయాన్ని తీర్పులు లేకుండా మాట్లాడుకోవడానికి కేటాయించాలి. పెద్దలు తమ ఖర్చులు, మాటతీరు, ఇతరుల పట్ల గౌరవంలో ఆదర్శంగా ఉండాలి. పిల్లలకు వయసుకు తగిన స్వేచ్ఛతోపాటు బాధ్యత ఇవ్వాలి. తప్పు చేసినప్పుడు శిక్ష ఒక్కటే మార్గంగా చూడకుండా, దాన్ని ఎలా సరిదిద్దాలో నేర్పాలి.

పాఠశాలలు, కళాశాలల్లో: పరీక్షలతోపాటు భావోద్వేగాలను అర్థం చేసుకోవడం, ఆర్థిక అవగాహన, డిజిటల్ భద్రత, సమ్మతి, వివాద పరిష్కారం వంటి జీవన నైపుణ్యాలను నేర్పాలి. విద్యతోపాటు విలువలు, కళలు, సంస్కృతికి స్థానం ఇవ్వాలని జాతీయ విద్యా విధానం 2020 కూడా సూచిస్తుంది. వసబఘ్‌అశీఅ.స్త్రశీజ.అఅ సమస్యను ముందుగానే గుర్తించేందుకు అందుబాటులో ఉండే కౌన్సెలింగ్ వ్యవస్థ అవసరం.

సమాజంలో: యువతకు క్రీడలు, కళలు, పఠనం, సేవా కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశాలు కల్పించాలి. మాదకద్రవ్యాల విక్రయం, రుణ యాప్‌ల వేధింపులు, ఆన్‌లైన్ మోసాలు, హింసపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. బాధితులు సహాయం కోరినప్పుడు వారిని అపహాస్యం చేయకుండా ఆదుకోవాలి.

### ముగింపు

చివరకు, ప్రశ్నకు సమాధానం 'పెంపకం' లేదా 'పరిస్థితులు' అనే రెండు పదాల్లో ఇమడదు. పెంపకం పిల్లలకు నిర్ణయాలు తీసుకునే పునాదిని ఇస్తుంది; పరిస్థితులు ఆ నిర్ణయాలను పరీక్షిస్తాయి. నేటి యువత ఎదుర్కొంటున్న సమస్యలకు పెంపకాన్ని మాత్రమే నిందించలేం; మారుతున్న కుటుంబ వ్యవస్థ, ఆర్థిక ఒత్తిళ్లు, స్నేహితుల ప్రభావం, డిజిటల్ ప్రపంచం కూడా వారి నిర్ణయాలను ప్రభావితం చేస్తాయి. పిల్లలకు ప్రేమతోపాటు హద్దులు, స్వేచ్ఛతోపాటు బాధ్యత నేర్పాలి. వారి సందేహాలను వినేందుకు కుటుంబం సమయం కేటాయించాలి. పాఠశాలలు జీవన నైపుణ్యాలు, ఆర్థిక అవగాహన, సంబంధాల్లో సమ్మతి, డిజిటల్ భద్రతపై శిక్షణ ఇవ్వాలి. వ్యసనాలు, అప్పులు, మానసిక సంక్షోభాలు ఎదురైనప్పుడు నిందించకుండా సహాయం అందించాలి. భారతీయ సంస్కృతిలోని గౌరవం, సహానుభూతి, అహింస వంటి విలువలను ఆచరణలో చూపాలి. నేటి మార్పులను అర్థం చేసుకుంటూ పెద్దలు మార్గనిర్దేశం చేసినప్పుడే యువత వివేకంతో ముందుకు సాగుతుంది.



ప్రొఫెసర్.
విశ్వేశ్వర రావు చెనమల్లు

# యూపీఐపై ఎండీఆర్: ఆర్థిక స్థిరత్వమా లేక సామాన్యుడిపై భారమా?

(ప్రతాప్)




భారత డిజిటల్ చెల్లింపుల విప్లవానికి యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) వెన్నెముకగా మారింది. చిన్న మొత్తాల నుంచి పెద్ద లావాదేవీల వరకు క్షణాల్లో చెల్లింపులు చేసే సౌలభ్యం సామాన్యుడి ఆర్థిక జీవితాన్నే మార్చివేసింది. నగదు వినియోగాన్ని తగ్గించి, పారదర్శకమైన డిజిటల్ లావాదేవీలకు ఊతమిచ్చిన యూపీఐపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) విధించే ప్రతిపాదన ఇప్పుడు ఆర్థిక, సామాజిక, వ్యాపార వర్గాల్లో చర్చకు దారితీస్తోంది.

ప్రతిపాదిత విధానం ప్రకారం, అక్టోబర్ 15, 2026 నుంచి వ్యాపారులకు రూ.2,000కు మించిన కొన్ని యూపీఐ లావాదేవీలపై 0.4 శాతం ఎండీఆర్ వసూలు చేయనున్నట్లు సమాచారం. ఈ భారాన్ని వినియోగదారులపై నేరుగా మోపబోమని ప్రభుత్వం స్పష్టం చేస్తున్నప్పటికీ, వ్యాపారులపై పడే వ్యయం చివరకు వస్తువులు, సేవల ధరల్లో ప్రతిఫలించే అవకాశం ఉందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

2020 నుంచి యూపీఐ, రూపే డెబిట్ కార్డు లావాదేవీలపై ఎండీఆర్‌ను శూన్యంగా ఉంచిన విధానం దేశంలో డిజిటల్ చెల్లింపుల విస్తరణకు గణనీయంగా దోహదపడింది. అయితే యూపీఐ వినియోగం విపరీతంగా పెరిగిన నేపథ్యంలో దాని నిర్వహణ, సైబర్ భద్రత, సాంకేతిక నవీకరణలు, మౌలిక వసతుల విస్తరణకు భారీ వ్యయం అవుతోంది. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, బ్యాంకులు, చెల్లింపు సేవల సంస్థలు ఈ వ్యవస్థను నిరంతరం నిర్వహించాల్సి ఉంటుంది. కాబట్టి దీర్ఘకాలికంగా యూపీఐ ఆర్థికంగా నిలదొక్కుకునే విధానం అవసరమన్న వాదనలో ఆలోచించాల్సిన అంశం ఉంది.అయితే సమస్య ఎండీఆర్ విధించాలా వద్దా అన్నదానితోనే ముగియదు. ఆ వ్యయాన్ని ఎవరు భరిస్తారు? ఎంతకాలం భరిస్తారు? దాని ప్రయోజనం ఎవరికి చేరుతుంది? అన్న ప్రశ్నలే కీలకం. ప్రతిపాదిత రుసుముల ద్వారా సంవత్సరానికి సుమారు రూ.15,000 కోట్ల ఆదాయం సమకూరుతుందని అంచనాలు ఉన్నప్పటికీ, ఆ మొత్తాన్ని ఏ విధంగా వినియోగిస్తారన్న దానిపై స్పష్టమైన పారదర్శకత అవసరం.ప్రభుత్వం చెబుతున్న ప్రకారం మొత్తం యూపీఐ లావాదేవీల్లో సుమారు 4 శాతం మాత్రమే ఈ చార్జీ పరిధిలోకి వస్తాయి. రూ.2,000లోపు లావాదేవీలు, వ్యక్తి నుంచి వ్యక్తికి జరిగే చెల్లింపులు ఉచితంగానే కొనసాగుతాయి. రైల్వే, టెలికాం, బీమా, ఇంధనం వంటి రంగాల్లో అధిక మొత్తాల చెల్లింపులకు ప్రత్యేకంగా తక్కువ స్థిర రుసుము విధించే ప్రతిపాదన కూడా ఉంది. ఈ మినహాయింపులు సామాన్య వినియోగదారుడిపై ప్రత్యక్ష ప్రభావాన్ని పరిమితం చేయడానికి ఉద్దేశించినవిగా కనిపిస్తున్నాయి.అయితే చిన్న వ్యాపారుల ఆందోళనను విస్మరించలేం. పెద్ద సంస్థలకు చిన్న శాతం రుసుము నిర్వహించడం సాధ్యమైనప్పటికీ, తక్కువ మార్జిన్‌తో పనిచేసే చిన్న దుకాణాలు, సేవా సంస్థలకు ప్రతి లావాదేవీపై అదనపు వ్యయం ప్రభావం చూపవచ్చు. ఆ వ్యయాన్ని వినియోగదారులపైకి బదిలీ చేస్తే డిజిటల్ చెల్లింపులపై విశ్వాసం దెబ్బతినే ప్రమాదం ఉంది. అదే సమయంలో వ్యాపారులపై పూర్తిగా భారం మోపినా డిజిటల్ చెల్లింపుల స్వీకరణ వేగం తగ్గే అవకాశం ఉంటుంది. అందుకే ఎండీఆర్ విధానంలో పరిమితి, పారదర్శకత, దశలవారీ అమలు కీలకం. చిన్న వ్యాపారులకు తగిన మినహాయింపులు లేదా రాయితీలు ఇవ్వాలి. రుసుము నిజంగా మౌలిక వసతులు, భద్రత, సాంకేతిక అభివృద్ధికే వినియోగిస్తున్నారా అన్నది ప్రజలకు వెల్లడించాలి. వినియోగదారుల నుంచి అదనపు మొత్తాన్ని వసూలు చేసే పరిస్థితులు ఏర్పడకుండా స్పష్టమైన నిబంధనలు రూపొందించాలి.యూపీఐ భారత ఆర్థిక వ్యవస్థలో కేవలం చెల్లింపు సాధనం కాదు. అది డిజిటల్ ఆర్థిక వ్యవస్థకు ఒక ప్రజా మౌలిక వసతిగా మారింది. అందువల్ల దాని ఆర్థిక స్థిరత్వం ఎంత ముఖ్యమో, దాని అందుబాటు, చౌకదనం, విశ్వసనీయత కూడా అంతే ముఖ్యం.యూపీఐని నిలబెట్టేందుకు అవసరమైన ఆదాయ నమూనాను రూపొందించడం తప్పు కాదు. కానీ ఆర్థిక స్థిరత్వం పేరుతో డిజిటల్ చెల్లింపుల ప్రజాస్వామ్య స్వభావం దెబ్బతినకూడదు. సాంకేతిక వ్యవస్థకు ఆర్థిక బలం, సామాన్యుడికి చెల్లింపు స్వేచ్ఛ---ఈ రెండింటి మధ్య సమతుల్యత సాధించినప్పుడే యూపీఐ విజయగాథ మరింత బలపడుతుంది.

# వాతావరణ సంక్షోభానికి చారిత్రక బాధ్యత ఎవరిది?

(సి.హెచ్. ప్రతాప్)

వాతావరణ సంక్షోభం ఇక రాబోయే తరాల సమస్య కాదు. మండుతున్న వేసవులు, అసాధారణ వర్షాలు, వరదలు, కరవులు, కరుగుతున్న హిమనదాలు, పెరుగుతున్న సముద్రమట్టాలు రూపంలో అది ఇప్పటికే మన గుమ్మం తట్టుతోంది. అయినా ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న చర్చలో ఒక మౌలిక ప్రశ్నకు ఇప్పటికీ స్పష్టమైన సమాధానం కనిపించడం లేదు. వాతావరణాన్ని ఈ స్థితికి తీసుకొచ్చిన దేశాలు ఎంత బాధ్యత తీసుకోవాలి? అభివృద్ధి బాటలో ఇప్పుడిప్పుడే వేగం పెంచుతున్న దేశాలు ఎంత భారాన్ని మోయాలి?పారిశ్రామిక విప్లవం తర్వాత బొగ్గు, చమురు, సహజవాయువుల విపరీత వినియోగమే భూమి వేడెక్కడానికి ప్రధాన కారణాల్లో ఒకటి. ఈ నేపథ్యంలోనే 2015 పారిస్ ఒప్పందం ప్రపంచ ఉష్ణోగ్రత పెరుగుదలను పారిశ్రామిక పూర్వస్థాయితో పోలిస్తే 2 డిగ్రీల సెల్సియస్‌కు చాలా దిగువన ఉంచాలని, సాధ్యమైనంతవరకు 1.5 డిగ్రీలకు పరిమితం చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది.హెచ్చరికలు మాత్రం మరింత తీవ్రమవుతున్నాయి. 2023 ఫిబ్రవరి నుంచి 2024 జనవరి వరకు 12 నెలల ప్రపంచ సగటు ఉష్ణోగ్రత 1850--1900 స్థాయితో పోలిస్తే 1.52 డిగ్రీల సెల్సియస్ అధికంగా నమోదైంది. ఇది పారిస్ లక్ష్యం శాశ్వతంగా దాటిపోయిందని చెప్పడానికి సరిపోదు. కానీ ప్రమాదరేఖకు ప్రపంచం ఎంత చేరువైందో చెప్పడానికి మాత్రం ఇది గట్టి హెచ్చరిక.ఇక్కడే వాతావరణ న్యాయం ప్రాధాన్యం సంతరించుకుంటుంది. భారత్ 2024లో ప్రపంచ కార్బన్‌డయాక్సైడ్ ఉద్గారాల్లో 8.27 శాతం వాటా కలిగి ఉంది. కానీ 1751 నుంచి లెక్కిస్తే చారిత్రక ఉద్గారాల్లో భారత వాటా కేవలం 3.57 శాతం. అంటే నేటి ఉద్గారాలను మాత్రమే చూసి బాధ్యతను నిర్ణయిస్తే పూర్తి చిత్రం కనిపించదు.సంపన్న దేశాలు దశాబ్దాల తరబడి చౌకైన శిలాజ ఇంధనాలను వినియోగించి పరిశ్రమలు నిర్మించాయి, రవాణా వ్యవస్థలను విస్తరించాయి, అధిక వినియోగ జీవనశైలిని సాధించాయి. ఆ అభివృద్ధి ప్రయాణంలోనే వాతావరణంలో భారీ మొత్తంలో కార్బన్ పేరుకుపోయింది. ఇప్పుడు అదే దేశాలు అభివృద్ధి చెందుతున్న దేశాలను ఒకే వేగంతో ఉద్గారాలు తగ్గించాలని కోరితే సమానత్వంపై ప్రశ్నలు రావడం సహజం.తలసరి ఉద్గారాలు కూడా ఈ చర్చలో కీలకం. ఒక దేశపు మొత్తం ఉద్గారం జనాభా పరిమాణంతో ముడిపడి ఉంటుంది. అందువల్ల మొత్తం ఉద్గారాలతోపాటు ఒక్కో వ్యక్తి ఉద్గారం, చారిత్రక బాధ్యత, ఆర్థిక సామర్థ్యం, అభివృద్ధి అవసరాలు కూడా పరిగణనలోకి రావాలి. కోట్లాది ప్రజలకు విద్యుత్, గృహం, రవాణా, ఉపాధి, పరిశ్రమలు అందించడం భారత్‌కు ఇంకా కొనసాగుతున్న అభివృద్ధి బాధ్యత.అయితే చారిత్రక అన్యాయం పేరుతో భారత్ తన పర్యావరణ బాధ్యతను పక్కన పెట్టడం కూడా సమంజసం కాదు. 2030 నాటికి స్థాపిత విద్యుత్ సామర్థ్యంలో 40 శాతం శిలాజేతర వనరుల నుంచి పొందాలన్న పాత పారిస్ లక్ష్యాన్ని భారత్ 2021 నవంబరులోనే సాధించింది. అప్పటికి శిలాజేతర స్థాపిత సామర్థ్యం 156.83 గిగావాట్లకు చేరి మొత్తం సామర్థ్యంలో 40.1 శాతంగా నమోదైంది.ఇక 2070 నాటికి నెట్-జీరో లక్ష్యాన్ని చేరుకోవాలంటే పునరుత్పాదక విద్యుత్, విద్యుత్ వాహనాలు, గ్రీన్ హైడ్రోజన్, ఇంధన సామర్థ్యం, అడవుల సంరక్షణ వంటి రంగాల్లో మార్పు మరింత వేగవంతం కావాలి. కానీ ఆ మార్పు అభివృద్ధిని అడ్డుకునేలా కాకుండా, అభివృద్ధినే శుభ్రమైన మార్గంలోకి మళ్లించేలా ఉండాలి.వాతావరణ న్యాయం అంటే ప్రతి దేశానికీ ఒకే శిక్ష విధించడం కాదు. కాలుష్యం చేసిన కాలం ఎంత? పరిమాణం ఎంత? తలసరి వినియోగం ఎంత? చెల్లించే సామర్థ్యం ఎంత? అభివృద్ధి అవసరం ఎంత?---ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానం దొరికినప్పుడే బాధ్యత న్యాయంగా పంచబడుతుంది.అభివృద్ధి చెందిన దేశాలు వేగంగా ఉద్గారాలు తగ్గించడంతో పాటు శుభ్రమైన సాంకేతికత, చౌకైన ఆర్థిక సహాయం, వాతావరణ నిధులను అభివృద్ధి చెందుతున్న దేశాలకు అందించాలి. భారత్ వంటి దేశాలు కూడా తక్కువ కార్బన్ అభివృద్ధి మార్గాన్ని మరింత వేగంగా అనుసరించాలి.భూమి ఒక్కటే. బాధ్యత మాత్రం ఒక్కటిగా ఉండదు. గతంలో ఎక్కువగా కాలుష్యం చేసినవారు ముందుగా ఎక్కువ బాధ్యత మోయాలి; ఇప్పుడెక్కువగా ఉద్గారాలు చేస్తున్నవారు తమ మార్గాన్ని వేగంగా మార్చుకోవాలి. వాతావరణ పోరాటం విజయవంతం కావాలంటే ఉద్గారాలు తగ్గడమే కాదు---బాధ్యత కూడా న్యాయంగా పంచబడాలి.



# పాడేరులో బిఎస్పి పార్టీ నాయకుల నిరసన

**పాడేరు: సెప్టెంబర్ 28 జయ జయహే.**

రాష్ట్రంలో 27 మంది దళితుల మరణలపై బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బందేల గౌతమ్ కుమార్ ఆదేశాల మేరకు, బహుజన్ సమాజ్ పార్టీ అల్లూరి జిల్లా అధ్యక్షులు శెట్టి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో పాడేరు కలెక్టర్ కార్యాలయంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు, రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనలో 27 మంది దళితుల హత్య జరిగిందని అన్నారు, ఈ హత్యపై సిట్టింగ్ జడ్జిలో విచారణ చేసి తక్షణమే బాధితులకు న్యాయం చేయాలని కోరారు, ఈ సందర్భంగా స్థానిక కలెక్టర్ టి నిశాంతి కు వినతి పత్రం అందజేశారు, ఆమె సానుకూలంగా స్పందించి ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని చెప్పారు, ఈ కార్యక్రమంలో పాడేరు బి.ఎస్.పి పార్టీ అధ్యక్షులు జిల్లా కార్యదర్శి ఎస్ పోతురాజు, అరకు వేలి మండల బి ఎస్ పి పార్టీ అధ్యక్షులు కె ప్రియాంక రాజ్, ఈ సందర్భంగా నాయకులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు,




## సచివాలయం ఉద్యోగులపై నిర్బంధం దుర్మార్గం

**అనకాపల్లి జయ జయహే**

తమ సమస్యల పరిష్కారానికై చలో విజయవాడ కు పిలుపునిచ్చి సెలవు రోజుల్లో కూడా ప్రజాస్వామ్యతంగా నిరసన తెలియజేస్తున్న సచివాలయ ఉద్యోగులపై రాష్ట్ర ప్రభుత్వ అత్యంత పాసవికంగా వ్యవహరించడం అక్రమ అరెస్టులు కోనుకోవడం దుర్మార్గమని అన్యాయమని సిఐటియు అనకాపల్లి జిల్లా కమిటీ సోమవారం సిఐటియు కార్యాలయంలో జరిగిన సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వివి శ్రీనివాసరావు ఆర్ శంకర్రావు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజులు తీవ్రంగా ఖండించారు తమ సమస్యలు పరిష్కరించకపోతే చలో విజయవాడ నిర్వహిస్తామని ముందే ప్రభుత్వానికి నోటీస్ చేయడం దీనిపై ఉద్యోగులంతా సిద్ధమైన తరుణంలో పోలీసులతో జిల్లా లో ఉద్యోగులపై బెదిరింపులకు పాల్పడటం రాష్ట్ర నాయకత్వాన్ని సస్పెండ్ చేయడం ఇలాంటి స్వామిగా చర్యలను సిఐటియు తీవ్రంగా ఖండిస్తున్నది ఉద్యోగుల పట్ల వారు సమస్యల పట్ల ఎన్నో ఏళ్ల నుంచి ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరించడం వల్ల ఉద్యోగుల ఆగ్రహానికి గురై ప్రభుత్వంపై నిరసన వ్యక్తం చేయడం జరిగింది . నోషనల్ ఇంక్రిమెంట్లు గానీ ఇప్పటికే పెండింగ్ బకాయిలు విడుదల ప్రమోషన్ విషయంలో కానీ రాష్ట్ర ప్రభుత్వం వీర పట్ల అనుసరించిన వైఖరి ఈ యొక్క ఆందోళనకు కారణంగా భావించాల్సి ఉంది తప్ప అణిచివేత పద్ధతులు అనుసరించడం ప్రభుత్వానికి ఎంత మాత్రం మంచిది కాదని వారిని అణచివేత పద్ధతులు అనుసరించడం చేపట్టడం దుర్మార్గమని వారు పేర్కొన్నారు ఇప్పటికైనా ప్రభుత్వం సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి తక్షణంగా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు తదితరులు పాల్గొన్నారు

# అల్లు సుధాకర్ ఆశయాల కొనసాగింపు

### సంస్మరణ సభలో బంధుమిత్రులు

**పెందుర్తి, సెప్టెంబర్ 28, జయ జయహే**

అల్లు సుధాకర్ సంస్మరణ సభ సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన అభిమానులు, స్నేహితులు, కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున హాజరై సుధాకర్ సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా శ్రీ మని ప్రకాష్ చారిటబుల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గొంప శ్రీరామమూర్తి,బత్తి శ్రీను , మండల సత్యనారాయణ,,




చంద్రశేఖర్,, రొంగలి ప్రకాష్ రావు,, సిహెచ్ ముత్యాల నాయుడు,, నాగభూషణ్,, శ్రీను,, అప్పలరాజు,, సూరి నాయుడు, సంతోష్,, బాలకృష్ణ,, నందకిషోర్,, తదితరులు పాల్గొన్నారు. అల్లు సుధాకర్ ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్ తో మరణించడం పట్ల కుటుంబ సభ్యులు.. స్నేహితులు విచారం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆశయాలను కొనసాగిస్తామని ప్రకటించారు.



## గిరిజన విశ్వవిద్యాలయాన్ని సందర్శించిన రాజస్థాన్ జర్నలిస్టుల బృందం

**విజయనగరం, సెప్టెంబర్ 28, జయ జయహే**

రాజస్థాన్‌కు చెందిన సీనియర్ జర్నలిస్టుల బృందం సోమవారం ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయాన్ని సందర్శించింది. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ టి. శ్రీనివాసన్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జితేంద్ర మోహన్ మిశ్రాతో జర్నలిస్టులు సమావేశమై విశ్వవిద్యాలయ కార్యకలాపాలు, విద్యా కార్యక్రమాలు, విద్యార్థుల అభివృద్ధి తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇన్చార్జి ఉపకులపతి ప్రొ. టి. శ్రీనివాసన్ విశ్వవిద్యాలయ స్థాపన, లక్ష్యాలు, విద్యా కార్యక్రమాలు, గిరిజన విద్యాభివృద్ధికి అందిస్తున్న సేవలు, వివిధ విద్యా, సాంస్కృతిక మరియు ఇతర కార్యక్రమాల గురించి జర్నలిస్టులకు వివరించారు. విశ్వవిద్యాలయం భవిష్యత్ విస్తరణ, మౌలిక వసతుల అభివృద్ధి, విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు చేపడుతున్న చర్యలను వివరించారు. ఇన్చార్జి రిజిస్ట్రార్ ప్రొ. జితేంద్ర మోహన్ మిశ్రా విశ్వవిద్యాలయంలో విద్యార్థులు, అధ్యాపకులు నిర్వహిస్తున్న వివిధ అకాడమిక్, సహపాఠ్య కార్యక్రమాలు, విద్యార్థుల ప్రతిభ, సాధించిన విజయాలు మరియు విశ్వవిద్యాలయ ప్రగతికి సంబంధించిన అంశాలను వివరించారు. ఈ కార్యక్రమాన్ని విశ్వవిద్యాలయ జర్నలిజం విభాగాధిపతి డా. ఇప్పిలి తారకేశ్వరరావు సమన్వయంతో నిర్వహించారు. కార్యక్రమంలో ఫైనాన్స్ ఆఫీసర్ ప్రొఫెసర్ శరత్‌చంద్రబాబు, లైబ్రేరియన్ డా. శంకరరెడ్డి కొల్లే, పరీక్షల అధికారి డా. సురేష్‌బాబు కలిదిండి, డా. అనిరుధ్ కుమార్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డా. ఎన్.వి.ఎస్. సూర్యనారాయణ, డా. దివ్య, డా. కుసుమ్, డా. లత, డా. ప్రమా చటర్జీ, డా. వెంకటేశ్వర్లు, డా. గంగు నాయుడు, ప్రసాద్, మనీష్ వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## భూ సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రాధాన్యత...

### ఉత్తరాంధ్ర విద్యార్థి సేన వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ సుంకరి రమణమూర్తి

**గుర్ల, సెప్టెంబర్ 28, జయ జయహే**

గుర్ల మండలం పాలవలస గ్రామంలో 50 ఏళ్లుగా సుమారు 50 మంది రైతుల యొక్క అర్థ శతాబ్దంగా పరిష్కారం కాని, గత పాలకులు పట్టించుకోని సుమారు 50 మంది రైతుల భూ సమస్య పరిష్కారంలో భాగంగా చీపురుపల్లి శాసనసభ్యులు కిమిడి కళా వెంకటరావు ఆదేశాలతో భూమిని క్షుణ్ణంగా సర్వే చేయిస్తున్నామని టీడీపీ సీనియర్ నాయకులు ఉత్తరాంధ్ర విద్యార్థి సేన వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ సుంకరి రమణమూర్తి అన్నారు. సోమవారం సర్వే డిపార్ట్మెంట్ కి సంబంధించిన అధికారులు వచ్చి 50 ఏళ్లుగా భూమి తాము సాగు చేస్తున్నా హక్కులు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న సుమారు 50 కుటుంబాలు కు సంబంధించిన భూమిని సంబంధిత రైతులు పార్టీ నాయకులు అభిమానుల సమక్షంలో సర్వే చేయడం జరిగింది. సంబంధిత రైతులు సర్వే అధికారులకు తమ భూములను చూపించి సమస్యను మొత్తం వివరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు చందక సూర్యనారాయణ, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ సుంకరి పైడినాయుడు, మాజీ సర్పంచ్ పొట్నూరు అచ్చం నాయుడు, గేదెల అప్పలనాయుడు వల్లూరు భాస్కరరావు, సుంకరి ఉపేంద్ర, ఇజ్జిరోతు యల్లారావు, రైతు సోదరుల ప్రతినిధి పొట్నూరు పాపినాయుడు , రైతు సోదరులు సంచాన బంగారు నాయుడు, సంచాన రమేష్, మంత్రి సుందరరావు, గేదెల సత్యనారాయణ, సంచాన అప్పలనాయుడు, నీటి సంఘం సభ్యులు వల్లూరు పైడితల్లినాయుడు, తెలుగు యువత ప్రతినిధులు తాడ్డి నారాయణరావు, వల్లూరు చిన్నం నాయుడు, తాడ్డి అప్పలనాయుడు, సర్వే అధికారులు ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## మాడుగుల నియోజకవర్గానికి 40 కోట్ల మంజూరు

**మాడుగుల, సెప్టెంబర్ 28, జయ జయహే**

మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి కృషితో నియోజకవర్గంలో గల 111 పంచాయతీలకు వి బి జి రాంజీ , పల్లె పండగ 3.0 కింద 40 కోట్లు నిధులు మంజూరు చేయడం జరిగిందనీ ఎమ్మెల్యే కార్యాలయం సోమవారం తెలిపింది వాటిలో భాగంగామాడుగుల మండలంలో గల29 పంచాయతీలకి 10 కోట్లు రూపాయలు,చీడికాడ మండలంలో గల 23 పంచాయతీలకి 10 కోట్లు రూపాయలు, దేవరాపల్లి మండలంలో గల 27 పంచాయతీలకి 10 కోట్లు రూపాయలు, కే కోటపాడు మండలంలో గల 32 పంచాయితీ లకి10 కోట్లు రూపాయలు మంజూరు అయినట్టు తెలిపారు.





## బిజెపి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

**మాడుగుల సెప్టెంబర్ 28 జయ జయహే**

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధికారం చేపట్టి 25 సంవత్సరాలు పూర్తి అవడంతోపాటు మోడీ పుట్టినరోజు వేడుకలు సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షులు మెలిపాక స్వామి ఆధ్వర్యంలో సోమవారం చింతలూరు గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో రోగులను తనిఖీ చేసి మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు కర్రి మాధురి, బీజేపీ నాయకులు స్థానిక న్యాయవాది శ్రీనాదు ప్రసాద రావు, కోన రామకృష్ణ, బత్తుల అరుణ, ఇల్లపు సురేంద్రనాథ్ ఇల్లపు సత్తిబాబు ,రాజు, సత్తిబాబు, కాంతరావు, గంగరాజు పాల్గొన్నారు

## నేడు పాఠశాలల్లో జరిగే ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

### ఎంఈఓ వి.వి ఈశ్వరరావు

**దేవరాపల్లి, సెప్టెంబర్ 28, జయ జయహే**



మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో మంగళవారం జరగబోయే యాజమాన్య కమిటీల (స్కూల్ మేనేజ్మెంట్) ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల విద్యాశాఖ అధికారి వి.వి. ఈశ్వరరావు తెలిపారు. సోమవారం ఎం ఆర్ సి కార్యాలయంలో స్థానిక విలేఖరులతో ఆయన మాట్లాడారు. 55 ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 2310 విద్యార్థులు, అలాగే తొమ్మిది ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న 1528 విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రుల యాజమాన్య కమిటీ ఎన్నికల నిర్వహణకు అన్ని పాఠశాలల్లో ఏర్పాటును పూర్తి చేయడం జరిగిందన్నారు. ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని ఏర్పాట్లు పటిష్టంగా చేయడం జరిగిందని తెలిపారు. ఎన్నికల నిర్వహణకు విద్యార్థుల తల్లిదండ్రులు అంతా హాజరై విధిగా ఎన్నికల్లో పాల్గొని, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా అంతా సహకరించాలని ఎం ఈ ఓ ఈశ్వరరావు కోరారు.



## రూ. 25 కోట్లతో స్వగృహ లే అవుట్‌లో మౌలిక వసతులు

**మధురవాడ, జయ జయహే :జీవిఎంసీ 8 వార్డు**

ఎండాడ స్థానిక రాజీవ్ స్వగృహ లే అవుట్ లో రూ. 25 కోట్లతో చేపట్టనున్న మౌలిక సౌకర్యాల కల్పన పనులకు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సోమవారం శంకుస్థాపన చేశారు. ఇక్కడ నిర్మించనున్న రోడ్లు, మంచి నీటి పైప్ లైన్లు, డ్రెయిన్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వంటి పనులను పబ్లిక్ హెల్త్ డిపార్మెంట్ పర్యవేక్షిస్తుంది. ఈ సందర్భంగా గంటా మాట్లాడుతూ లే అవుట్ అభివృద్ధిలో మౌలిక వసతులు ముఖ్యమని పేర్కొన్నారు. నాణ్యత విషయంలో రాజీ లేకుండా నిర్దేశించిన గడువులోగా పనులను పూర్తి చేయాలని చెప్పారు. స్థానిక నాయకులు చెట్టుపల్లి గోపీ, లొడగల అప్పారావు, చెట్టిపల్లి సన్యాసిరావు, సారిపల్లి శ్రీనివాస్, మంగాదేవి, దొరబాబు తదితరులు పాల్గొన్నారు.



### భీమిలి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త

# డాక్టర్ బొత్స అనూషకు ఘన సత్కారం

**మధురవాడ, జయ జయహే :**

భీమిలి నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నూతన సమన్వయకర్తగా నియమితులైన డాక్టర్ బొత్స అనూషని ఆంధ్ర ప్రదేశ్ శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణని జీవీఎంసీ 7వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు సోమ వారం విజయనగరంలోని వారి స్వగృహంలో జరిగిన ఈ భేటీలో నాయకులంతా కలిసి వారికి హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు ఈ సందర్భంగా భీమిలి సమన్వయకర్తగా నూతన బాధ్యతలు చేపట్టిన డాక్టర్ బొత్స అనూషను శాలువా తో ఘనంగా సత్కరించి, పూల బొకే అందజేశారు నియోజకవర్గంలో ప్రజలకు మరింత చేరువగా ఉంటూ, పార్టీ శ్రేణులన్నింటినీ సమ న్వయం చేసుకుంటూ వైఎస్సార్‌సీపీ బలో పేతానికి ముందుకు సాగాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు ఈ మర్యాదపూర్వక కలయిక లో జీవీఎంసీ 7వ వార్డు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోతిన శ్రీనివాసరావు,విశాఖ జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ పిల్లా సూరిబాబు,7వ వార్డు యూత్ ప్రెసిడెంట్ కె. వెంకటేష్ పాల్గొన్నారు. వీరితో పాటు వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులు వి. రామిరెడ్డి, ఎల్లాజీ, పద్మ, పిల్లా వెంకటరమణ, పిల్లా పోతరాజు,పీస రామా రావు,బొల్లు అప్పారావు, దుక్క వరం,పిల్లా అప్పా రావు,పిల్లా రమణ,పి.రాజు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 1.60 కోట్లతో ఎస్సీ సామాజిక భవనాల నిర్మాణానికి భూమి పూజ

**అనకాపల్లి జయ జయహే**

అనకాపల్లి పట్టణంలో ఎస్సీ సామాజిక వర్గ సంక్షేమ అభివృద్ధి లక్ష్యంగా జీవీఎంసీ 110,112 డివిజన్లో పాత ( 82,83 వార్డులో ) సుమారు 1.60 కోట్ల నిధులతో నిర్మించనున్న నూతన ఎస్సీ సామాజిక భవనాలకు సోమవారం నాడు కోటమి నాయకులు వైభవంగా భూమి పూజలు నిర్వహించారు ఏఎంసీ కాలనీ,శ్రీరామ్ నగర్, ఆర్టిసి కాంప్లస్ వద్ద పెద్ద రెల్లి వీధి దగ్గర ప్రాంతాల్లో సామాజిక భవనాలు మంజూరయ్యాయి అనకాపల్లి స్థానిక శాసనసభ్యులు మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ అనకాపల్లి పార్లమెంటు సభ్యులు రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్ సీఎం రమేష్ తెలుగుదేశం పార్టీ నాయకులు మాజీ ఎమ్మెల్యే పేల గోవింద సత్యనారాయణ వీరందరూ ప్రత్యేక చొరవతో నిధులు మంజూరయ్యాయని స్థానిక కూటమి నాయకులు తెలియజేశారు సామాజిక వర్గ



ప్రజల సుదీర్ఘ నిరీక్షణకు నేటితో తెరపడిందని వారు ఆనందం వ్యక్తం చేశారు భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి భూమి పూజ పూర్తి చేసినందుకు స్థానిక ప్రజలు కూటమి నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు జీవీఎంసీ అనకాపల్లి జోనల్ కమిషనర్ కే చక్రవర్తి జీవీఎంసీ ఇంజనీర్ డి ఈ గోపాలకృష్ణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్టీ కార్పొరేషన్ డైరెక్టర్ సబ్బవరపు గణేష్ అనకాపల్లి జిల్లా ఎన్టీఆర్ ఆస్పటల్ డైరెక్టర్ ఆళ్ళ రామచంద్రరావు 83వ డివిజన్ టిడిపి ఇంచార్జ్ పోలార్పు త్రినాధ్ 83వ డివిజన్ జనసేన ఇన్చార్జి మంగ ఈశ్వర్ మార్కెట్ యార్డ్ కమిటీ డైరెక్టర్ భరణి కాన రాంబాబు వైశ్యాస్ సంఘం అధ్యక్షులు సురే సతీష్ జనసేన నాయకులు దొడ్డి రాము టిడిపి నియోజకవర్గ మీడియా కోఆర్డినేటర్ ఎస్ భానుచందర్ కొనసాల గణేష్ మోప్పన లింగేశ్వర కోయిలాడ గణేష్ డివిజన్ బిజెపి పార్టీ నాయకులు నర్సింగ్ యాదవ్ హుడా రమేష్ ఓరుగంటి నాగమణి భానుమతి టిడిపి మహిళా అధ్యక్షురాలు బొమ్మల దేవి నీలాపు పండు సత్యవతి మణికంఠ ప్రసాద్ వాసు ఫణీంద్ర చరణ్ మహేష్ పురుషోత్తం కూటమి పార్టీ నాయకులు జీవీఎంసీ ఏఈలు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

For a pure tomorrow.. జయహే

# ఘనంగా విశాఖ 'స్టేషన్ మహోత్సవ' వేడుకలు

### విశాఖపట్నం రైల్వే స్టేషన్ 130 వసంతాల అద్భుత ప్రస్థానం

### ప్రత్యేక స్మారక కాఫీ టేబుల్ బుక్ ఆవిష్కరించిన జీఎం సందీప్ మాథుర్

**విశాఖపట్నం, సెప్టెంబర్ 28, జయ జయహే :**




భారతీయ రైల్వే పరిధిలోని ప్రధాన రైల్వే స్టేషన్ల చారిత్రక ప్రాధాన్యతను, వారసత్వాన్ని గౌరవించేందుకు రైల్వే మంత్రిత్వ శాఖ చేపట్టిన దేశవ్యాప్త కార్యక్రమంలో భాగంగా, విశాఖపట్నం రైల్వే స్టేషన్ తన వార్షికోత్సవాన్ని 'స్టేషన్ మహోత్సవ'ను ఘనమైన సాంస్కృతిక, వారసత్వ వేడుకలతో సోమవారం నిర్వహించింది. నాటి చారిత్రక వాల్తేరు శకం నుండి తూర్పు తీరంలోనే అత్యంత రద్దీగల, క్రియాశీలక రవాణా కేంద్రంగా ఎదిగిన విశాఖపట్నం రైల్వే స్టేషన్ యొక్క చారిత్రక ప్రస్థానాన్ని ఈ మైలురాయి సందర్భం ప్రతిబింబించింది. ఈ వేడుకలు ఉత్సాహభరితమైన ఫ్లాగ్ మార్చ్‌తో ప్రారంభమయ్యాయి. పూర్వపు వాల్తేరు డివిజన్ మరియు విశాఖపట్నం రైల్వే స్టేషన్ యొక్క పరిణామక్రమం, విశేష విజయాలు, ఘన వారసత్వాన్ని కళ్లకు కట్టే అరుదైన పాత ఛాయాచిత్రాలు, చారిత్రక వస్తువులు, అవశేషాలను ఈ ప్రదర్శనలలో కొలువుదీర్చారు. శతాబ్దానికి పైగా సాగిన పరివర్తన చరిత్ర, ప్రసిద్ధ వారసత్వ నిర్మాణాలు, రైల్వే మైలురాళ్లను పొందుపరుస్తూ రూపొందించిన "వాల్తేరు విశాఖపట్నం" అనే ప్రత్యేక స్మారక కాఫీ టేబుల్ బుక్ ఆవిష్కరణ ఈ వేడుకల్లో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఈ ఉత్సవాల్లో భాగంగా ఆకాశంలోకి హీలియం బెలూన్‌ను ఎగురవేయడంతో పాటు, జ్ఞాపికల పంపిణీ మరియు స్థానిక కళలు, సంస్కృతిని చాటిచెప్పే రంగుల సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దక్షిణ కోస్తా రైల్వే జనరల్ మేనేజర్ సందీప్ మాథుర్ ముఖ్య అతిథిగా హాజరైన ఈ కార్యక్రమంలో విశాఖపట్నం డీఆరఎం లలిత్ బోహ్రా, ఏడీఆరఎం (ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) ఈరంకి శాంతారావు, ఏడీఆరఎం (ఆపరేషన్స్) కె. రామారావు, బ్రాంచ్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ సందీప్ మాథుర్ మాట్లాడుతూ: "రైల్వే వారసత్వం అనేది మన ఉమ్మడి గుర్తింపులో ఒక అమూల్యమైన భాగం, ఇది తరతరాల రైల్వే సిబ్బంది యొక్క నిరంతర శ్రమకు ప్రతిరూపం. 1896లో కేవలం రెండు ప్లాట్‌ఫారాలు, రోజుకు సుమారు 200 మంది ప్రయాణికులతో నిరాడంబరంగా ప్రారంభమైన విశాఖపట్నం రైల్వే స్టేషన్, నేడు 8 ప్లాట్‌ఫారాల ద్వారా ప్రతిరోజూ 65 వేల మందికి పైగా ప్రయాణికులకు సేవలందిస్తూ అత్యంత రద్దీగల రవాణా కేంద్రంగా ఎదిగిందన్నారు. డీఆరఎం లలిత్ బోహ్రా మాట్లాడుతూ వాల్తేరు కాలం నుండి నేటి వరకు విశాఖపట్నం సాధించిన 130 ఏళ్ల రైల్వే వారసత్వాన్ని గౌరవిస్తూనే, దానిని ఆధునిక ప్రపంచ స్థాయి రవాణా కేంద్రంగా మార్చడమే తమ సంకల్పమని స్పష్టం చేశారు. స్టేషన్ పునరాభివృద్ధికి నిరంతరం సహకరిస్తున్న విశాఖపట్నం ప్రజలకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.



## డాక్టర్ జాలాది విజయకు జాషువా పురస్కారం

### రూ.50 వేల నగదు పారితోషికంతో సత్కారం

**అమరావతి, సెప్టెంబర్ 28, జయ జయహే**

ప్రముఖ కవి గుర్రం జాషువా జయంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక గుర్రం జాషువా పురస్కారాన్ని సాహితీవేత్త, పరిశోధకురాలు డాక్టర్ జాలాది విజయకు అందజేసింది. సోమవారం అమరావతిలో నిర్వహించిన జాషువా జయంతి వేడుకల్లో ఈ పురస్కారాన్ని ఆమెకు ప్రదానం చేశారు. పురస్కారంతో పాటు రూ.50 వేల నగదు పారితోషికాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, ప్రముఖ రంగస్థల కళాకారుడు గుమ్మడి గోపాలకృష్ణ, భాషా సాంస్కృతిక రంగానికి చెందిన తేజశ్వని గౌడ్, భాషా చైర్మన్ విక్రమ్ పూలే తదితరులు పాల్గొన్నారు. సాహిత్య రంగంలో విశేష కృషి చేస్తున్న డాక్టర్ జాలాది విజయకు జాషువా పురస్కారం దక్కడం పట్ల సాహితీవేత్తలు, కళాకారులు, అభిమానులు హర్షం వ్యక్తం చేశారు. సామాజిక చైతన్యం, మానవతావాదం, సమానత్వం వంటి విలువలను తన రచనల ద్వారా ముందుకు తీసుకెళ్లిన గుర్రం జాషువాపై ఆమె అనేక వ్యాసాలు రచించారు. అంతేకాకుండా ప్రముఖ గేయ రచయిత జాలాది రచించిన సుమారు 1,500 పాటలపై పరిశోధన చేసి పీహెచ్‌డీ పట్టా పొందిన ఘనత డాక్టర్ జాలాది విజయ సొంతం. జాలాది సాహిత్యంపై ఆమె చేసిన పరిశోధన తెలుగు సాహిత్య పరిశోధనా రంగంలో ప్రత్యేక గుర్తింపును తెచ్చిపెట్టింది. గుర్రం జాషువా సాహిత్యంపై వ్యాసాలు రచిస్తూ, జాలాది గేయ సాహిత్యంపై లోతైన పరిశోధన సాగించిన డాక్టర్ జాలాది విజయకు రాష్ట్ర ప్రభుత్వం జాషువా పురస్కారం అందించడం ఆమె సాహిత్య సేవలకు లభించిన గౌరవంగా పలువురు అభివర్ణించారు. ఈ సందర్భంగా డాక్టర్ జాలాది విజయకు సాహితీవేత్తలు, కళాకారులు, సాహిత్యాభిమానులు అభినందనలు తెలిపారు.

## అవుట్సోర్సింగ్ ఉద్యోగుల సత్యాగ్రహం దీక్షను జయప్రదం చేయండి

**అనకాపల్లి జయ జయహే**

రాష్ట్ర ప్రభుత్వ వివిధ శాఖలలో పని చేస్తున్న కాంటాక్ట్ మరియు ఔట్ సోర్సింగ్ ఆప్కాస్ ఉద్యోగులను కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం పర్మినెంట్ చేయాలని ఈ లోపు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అక్టోబర్ 2 గాంధీ జయంతి రోజు విశాఖలోనే గాంధీ విగ్రహం వద్ద జరుగు ఉత్తరాంధ్ర జిల్లాల సత్యాగ్రహ దీక్షను జయప్రదం చేయాలని ఏపీ స్టేట్ గవర్నమెంట్ కాంటాక్ట్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా కన్వీనర్ శ్రీనివాసరావు పిలుపునిచ్చారు సోమవారం ఉదయం కాంట్రాక్ట్ అసోసియేషన్ ఉద్యోగులతో కరపత్రాన్ని ఆవిష్కరించారు రాష్ట్ర విభజన అనంతరం కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు ఎం టి ఎస్ తిలోదికాలిచ్చి ఉద్యోగులు జీతాల్లో కోతకు కారణమయ్యారు అని రాష్ట్ర ప్రభుత్వ శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు మాత్రమే ఎం టి ఎస్ అమలు చేస్తూ జీవో నెంబర్ 5 జారీ చేశారని దీంతో విద్యాశాఖ సమగ్ర శిక్ష వైద్య విభాగంలో నేషనల్ హెల్త్ మిషన్ వివిధ ప్రభుత్వ పథకాలు విద్యుత్తు ఆర్టీసీ తదితర ప్రభుత్వ రంగ సంస్థల్లో మున్సిపాలిటీలో కేజీబీవీ లో సొసైటీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్ ఉద్యోగులందరికీ ఎండీఎస్ నో తొలగించింది పెరుగుతున్న ధరలకు అనుగుణంగా జీతాలు అందకపోవడంతో కాంట్రాక్టర్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు అనేక రాష్ట్రాల్లో అవుట్సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేస్తున్నాయి కానీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఏళ్ల తరబడి పనిచేస్తున్న వెట్టి చాకిరి చేయించుకుంటున్నారు తప్ప పర్మినెంట్ చేయడం లేదు కనీసంగా ప్రతి నెల జీతాలు కూడా ఇవ్వని పరిస్థితి ఉన్నదని నీ నేపథ్యంలోనే రాష్ట్రంలో ఉండే అన్ని ప్రభుత్వ శాఖల కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ తదితర అన్ని విభాగాలు ఉద్యోగులతో అక్టోబర్ 2న విశాఖపట్నంలో గాంధీజీ విగ్రహం వద్ద సత్యాగ్రహ దీక్షను నిర్వహించడం జరుగుతుందని వారు పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో ఎన్ హెచ్ ఎం జేఏసీ జిల్లా అధ్యక్షుడు ఎం రామకృష్ణ, రమేష్ పాల్గొన్నారు. జిల్లాలో ఉండే కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ వివిధ పథకాల ఉద్యోగులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు






## అంతర్రాష్ట్ర డ్రగ్స్ ముఠా గుట్టురట్టు

**అనకాపల్లి జయ జయహే**

జిల్లాలో మాదక ద్రవ్యాల అక్రమ రవాణా వినియోగంపై పోలీసులు ఉక్కు పాదం మోపుతున్న అనకాపల్లి జిల్లా పోలీసులు మరోసారి భారీ అంతర్రాష్ట్ర ముఠా గుట్టును రట్టు చేశారు ఒడిస్సా నుంచి కేరళకు భారీ ఎత్తున తరలిస్తున్న 5.5 కోట్లు విలువచేసే హాషిష్ మత్తు కలిగించే ఆయిల్ ను అక్రమ రవాణా చేస్తూ ఉండగా చాకచక్యంగా పోలీసులు పట్టుకుని ఈ నెట్వర్క్ ఛేదించారు అని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా మీడియా సమావేశంలో పేర్కొన్నారు ఆయన ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా మాదక ద్రవ్యాల అణిచివేతకు ప్రత్యేక మెగా బృందాన్ని ఏర్పాటు చేసినట్లు ఈ క్రమంలో విశ్వసనీయ సమాచారం అందుకున్న వి మాడుగుల ఎస్సై మరియు వారి పోలీసు బృందం మాడుగుల మండలం పరిధిలోని ఎం కోడూరు జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీలు చేపట్టారు పాడేరు ఘాట్ రోడ్డు మీదుగా అనుమానాస్పదంగా వస్తున్న ఒక ప్యాసింజర్ ఆటో ఏపీ 39ఎక్స్ 3211 మరియు మోటార్ సైకిల్ వాణ30ఎ 51 30 లను పోలీసులు అడ్డగించి క్షుణ్ణంగా తనిఖీ చేయగా అందులో దాచిన 43 ప్యాకెట్ల హసిప్ ఆయిల్ ఒక ప్యాకెట్ సుమారు ఒక లీటర్ చొప్పున మొత్తం 43 లీటర్ల పట్టుబడిందని దీని విలువ సుమారు 5.50 కోట్లు ఉంటుందని అంచనాగా పోలీసులు తెలియజేశారు ఆయిల్ తో పాటు రవాణాకు ఉపయోగించిన ఆటో మోటార్ సైకిల్ ను పోలీసులు స్వాధీనం చేసుకుని ఆటలో ఉన్న ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకోవడం జరిగింది ఈ అక్రమ రవాణా ముఠా ఒడిస్సా రాష్ట్రం మల్కనగిరి జిల్లా చిత్రకొండ పరిధిలోని మాలిగూడ దాబుగూడ ప్రాంతాల నుంచి ఈ ఆయిల్ ను సేకరించి పాడేరు ఘాట్ రోడ్డు మీదుగా అనకాపల్లి మీదుగా కేరళలోని పాలకాడకు తరలించేందుకు సన్నహాలు చేసుకున్నారని పోలీసు విచారణలో తెలిసింది నిందితుల్లో ఒకరైన అరుణ్ కుమార్ ఒడిస్సాలో రవాణాకు ఏర్పాటు చేసి నిందితులకు నగదు అందించి ముందే కేరళ కు పరారయ్యాడు పరారీలో ఉన్న నిందితుడు కోసం పోలీసులు విస్తృత గాలింపు చర్యలు మమవరం చేశారు



## కొండయ్యవలసలో ఘనంగా శ్రీ వినాయక నిమజ్జనం

**అగనంపూడి, సెప్టెంబర్ 28, జయ జయహే**

జీవీఎంసీ 102 వార్డ్ కొండయ్య వలస గ్యాంగ్ స్టార్ బాయ్స్ ఆధ్వర్యంలో శ్రీ వరసిద్ధి వినాయకుని పూజా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అన్న సమారాధన చేసి భక్తుల మన్ననలందుకున్నారు. చివర రోజు స్థానిక మండపం ప్రాంగణములో మహిళకు మ్యూజికల్, పిల్లలకు వివిధ రకాల పోటీలు నిర్వహించి ఏడిసి చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ ద్వారా విజేతలకు బహుమతులందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ సాంప్రదాయ ప్రకారం పిల్లలు చిన్ననాటి నుండే ఆధ్యాత్మికంగా ఎంతో భక్తిశ్రద్ధలతో ఇటువంటి కార్యక్రమాలు చేయడం పట్ల వారిని అభినందించారు. అనంతరం మేళ తాళాలతో సోమవారం గ్రామ పురవీదులో ఊరేగించి ప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం నిమజ్జనం చేశారు. ఈ ఊరేగింపులో తోకాడ రాము, ఈశ్వరమ్మ లీల లక్ష్మి రమణమ్మ గ్యాంగ్ స్టార్ బాయ్స్ ప్రతినిధులు శెట్టి యశ్వంత్ తోకాడ శ్రీనివాస్ శెట్టి మనోజ్ కుమార్ స్వామి కోనేటి కిరణ్ చంద్ మరియు బాయ్స్ గ్రామ పెద్దలు పురజనులు పాల్గొన్నారు,




## రైలు ప్రమాదంలో మృతి చెందిన విద్యార్థుల కుటుంబాలను ఆదుకోవాలి

### 25 లక్షల ఆర్థిక సహాయం ఉపాధి కల్పించాలి

### ఏపీ నిరుద్యోగ పోరాట సమితి డిమాండ్

**టెక్కలి సెప్టెంబర్ 28 జయ జయహే**

శ్రీకాకుళం జిల్లా టెక్కలి మండలంలోని బర్మా కాలనీ సమీపంలో ఇటీవల జరిగిన ఘోర రైలు ప్రమాదం లో మృతి చెందిన నలుగురు గిరిజన విద్యార్థుల కుటుంబాలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే ఆదుకొని ఒక్కో కుటుంబానికి 25 లక్షల ఆర్థిక సహాయం, కుటుంబానికి ఒక ఉద్యోగం, టెక్కలి కేంద్రంలో ఆ కుటుంబాలకు శాశ్వత గృహాలు కల్పించాలని ఆంధ్ర ప్రదేశ్ నిరుద్యోగ పోరాట సమితి అధ్యక్షులు తలసముద్రం సూర్యం డిమాండ్ చేశారు. టెక్కలి ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి స్థానిక సభ కలెక్ట కార్యాలయం వరకు మరణించిన విద్యార్థులకు నివాళులర్పిస్తూ కొవ్వొత్తులు వెలిగించి వారి ఆత్మకు శాంతి కలగాలని భారీ ర్యాలీ నిర్వహించి బాధిత కుటుంబాల తరఫున సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ నిరుద్యోగ పోరాట సమితి ప్రతినిధి సూర్యం తో పాటు దళిత చైతన్య వేదిక అధ్యక్షులు బసవల గోవిందరావు,గేదెల శ్రీను, లక్ష్మీపురం రామచంద్రుడు, కాని జగ్గారావు, జె శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

# జీవీఎంసీ ఎన్నికల్లో బలమైన అభ్యర్థులతో వైసీపీ పోటీ ...!

### కూటమి ప్రభుత్వంపై నిరంతర పోరాటం

### విశాఖ భవిష్యత్తును కాపాడేందుకు ప్రజలు అండగా నిలవాలి

### వైసీపీ ముఖ్య నేతల సమన్వయ సమావేశంలో నిర్ణయం

**విశాఖపట్నం, సెప్టెంబర్ 28:**




విశాఖపట్నం మహానగర పాలక సంస్థ (జీవీఎంసీ) ఎన్నికలను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, నగరంలోని ప్రతి వార్డులోనూ గెలుపు అవకాశాలు ఉన్న బలమైన అభ్యర్థులను బరిలోకి దింపేందుకు పార్టీ సిద్ధంగా ఉందని పార్టీ నాయకులు నిర్ణయించారు. విశాఖపట్నం మద్దిలపాలెం కృష్ణా కాలేజ్ రోడ్డులోని జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా పార్టీ అధ్యక్షులు కె.కె రాజు ఆధ్వర్యంలో సోమవారం జీవీఎంసీ సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలు, వార్డుల వారీగా పార్టీ పరిస్థితి, బలమైన అభ్యర్థుల ఎంపిక, ప్రజా సమస్యలపై చేపట్టాల్సిన ఉద్యమాలు తదితర అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశంలో శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ, పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు, మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు, మాజీ పార్లమెంట్ సభ్యురాలు సత్యవతి, మాజీ ఎమ్మెల్యేలు శోభా హైమావతి, కరణం ధర్మశ్రీ, మళ్ల విజయప్రసాద్, తైనాల విజయకుమార్, కంబాల జోగులు, అన్నంరెడ్డి అదీప్ రాజ్, చింతలపూడి వెంకటరామయ్య, తిప్పల గురుమూర్తిరెడ్డి, సమన్వయకర్తలు తిప్పల శ్రీనివాస్, దేవన్ రెడ్డి , మొల్లి అప్పారావు, బొత్స అనూష, నియోజకవర్గ పరిశీలకులు చింతకాయల సన్యాసి పాత్రుడు, సతీష్ వర్మ డాక్టర్ జహీర్ అహ్మద్, పేడాడ రమణికుమారి తదితరులు పాల్గొన్నారు. పార్టీ అధ్యక్షులు వై.ఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు విశాఖ నగరంలో పార్టీ శ్రేణులను అన్ని స్థాయిల్లో సమన్వయం చేసి ఎన్నికలకు సిద్ధం చేస్తున్నట్లు నాయకులు తెలిపారు. ప్రతి వార్డులోనూ ప్రజలతో నిరంతరం మమేకమై పనిచేసి, ప్రజలకు అందుబాటులో ఉండే, గెలుపు సామర్థ్యం కలిగిన అభ్యర్థులను గుర్తించి ఎన్నికల బరిలో నిలబెడతామని పేర్కొన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో విశాఖపట్నం అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చామని నాయకులు గుర్తుచేశారు. సాధారణ కుటుంబానికి చెందిన మహిళకు విశాఖ మేయర్‌గా అవకాశం కల్పించడం ద్వారా సామాజిక న్యాయానికి ప్రాధాన్యత ఇచ్చిన ఘనత వైఎస్ జగన్ గారి ప్రభుత్వానిదని తెలిపారు.

# ముంచంగిపుట్టులో ఘనంగా రమాబాయి భవన కార్మికుల ఆత్మీయ సమ్మేళనం

**ముంచంగిపుట్టు, జయ జయహే**




ముంచంగిపుట్టు మండల కేంద్రంలోని హోలీ గ్రౌండ్‌లో రమాబాయి భవన కార్మికుల మండల అసోసియేషన్ రెండో ఆవిర్భావ దినోత్సవ ఆత్మీయ సమ్మేళనం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భవన నిర్మాణ కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ముఖ్యఅతిథిగా ముంచంగిపుట్టు పోలీస్‌స్టేషన్ ఎస్ఐ పి. నాని పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. పనుల నిమిత్తం ఇతర జిల్లాలకు లేదా ఒడిశా వంటి సరిహద్దు ప్రాంతాలకు వెళ్లే కార్మికులు భద్రతా కారణాల దృష్ట్యా ముందుగానే ముంచంగిపుట్టు పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించి వెళ్లాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ-శ్రమ్ కార్డు, ప్రధానమంత్రి సురక్షా బీమా పథకం, ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా పథకం, కార్మికుల గుర్తింపు కార్డు ద్వారా లభించే పింఛన్లు, విద్యార్థుల ఉపకార వేతనాలు తదితర సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే గంజాయి అక్రమ రవాణా, నాటుసారా తయారీ వల్ల కలిగే అనర్థాలు, ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు దూరంగా ఉండాల్సిన అవసరం, సైబర్ నేరాల పట్ల అప్రమత్తత, రహదారి భద్రతా నిబంధనలు, బాల్యవివాహాల నిషేధం, మహిళల భద్రత, బాలలపై లైంగిక నేరాల నిరోధక చట్టం వంటి అంశాలపై కార్మికులకు విస్తృతంగా అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితుల్లో సైబర్ నేరాల ఫిర్యాదుల కోసం 1930, పోలీసుల సహాయం కోసం 112 నంబర్లను సంప్రదించాలని ఎస్ఐ సూచించారు. అలాగే చోడవరం లేబర్ ఇన్సూరెన్స్ ఆఫీసర్ సూర్యనారాయణ మాట్లాడుతూ భవన కార్మికులు విధిగా ప్రతి ఒక్కరు ఇన్సూరెన్స్ చేయించుకోవాలని, దానివలన కుటుంబానికి భరోసాగా ఉంటుందని సూచించారు, అలాగే పలువురిని భవన్ కార్మికులు సార్ వాళ్ళతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొర్రా త్రినాథ్, గిరిజన సంఘం మండల అధ్యక్షుడు ఎం.ఎం శ్రీను, భవన కార్మికుల అసోసియేషన్ మండల అధ్యక్షుడు రవి, ప్రతినిధులు పిత్ బాస్, బురిడీ నర్సింగ్, మఠం ప్రమోద్ పడాల్, బురిడి శరత్, వంతాల నాగరాజు, అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు,




## ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలి

**డుంబ్రిగూడ: సెప్టెంబర్ 28 జయ జయహే,**

డుంబ్రిగూడ మండల కేంద్రంలో ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి తామర్ల సూర్యనారాయణ ఆద్వర్యంలోని నిరసన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పాంగి. సురేష్ కుమార్ మాట్లాడుతూ, ఇటీవల కాలంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, ఎలక్షన్ కమిషనర్ కుమ్మక్కై ఓట్ల సవరణ ప్రక్రియ(సర్) పేరుతో దేశంలోని సుమారు 13కోట్ల పౌరుల ఓట్లు చోరికి పాల్పడిందనీ విమర్శించారు. ప్రస్తుత కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ వెంటనే తమ పదవులకు రాజీనామా చేసి దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బిజెపి, ఆర్ ఎస్ ఎస్ కన్నుసనలో కేంద్ర ఎన్నికల కమిషనర్ పనిచేస్తూ ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని అపహాస్యం చేసిందని మండిపడ్డారు. దేశంలోని యువత ఓటు హక్కు ను కాపాడు కోవడానికి పోరాటం చేయాలనీ కోరారు. అందరు కలిసి రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు, ఈకార్యక్రమంలో గిరిజన సంఘం మండల అధ్యక్షులు పాంగి. సత్యనారాయణ, మండల నాయకులు పాంగి. డొంబు, పాంగి. మోహన్ దాస్, పాంగి. మత్తు, పాంగి. తిలక్, పాంగి. వసంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

## నాన్న' మీద రచనలకు ఆహ్వానం

### అక్టోబర్ 10లోగా నిర్వాహకులకు రచనలు చేరాలి

**విశాఖపట్నం,సెప్టెంబరు 28, జయ జయహే :**

విశాఖపట్నానికి చెందిన ప్రముఖ సాహితీవేత్త, కవి, కథకుడు, పత్రికా రచయిత, సాంస్కృతిక విశ్లేషకుడు రాజహంస ఆధ్వర్యంలో దివంగత ప్రధానోపాధ్యాయులు "బందిలి డేవిడ్ రాజు స్మారక రచనలపోటీ-2026" జరుగనుంది. ఈ పోటీలకు ఇతివృత్త అంశం 'నాన్న' పోటీలో పాల్గొనే కవులు, రచయితలు తమ రచనల నిడివి అర రావు సైజు కాగితంపై ఒక్కో పేజీకి 24 లైన్లకు, నాలుగు అరఠావులకు మించకుండా చూసుకోవాలి. రచనలపై ఎక్కడా తమ పేరు ,చిరునామా, ఆచూకీ, ఫోన్ నంబరు ఏవీ రాయకూడదు. ముఖ్య షరతులు రచనలన్నీ ఉత్తమ పురుషలోనే సాగాలి. వీలైతే వ్యాసంతోపాటు నాన్నతో తమ ఫొటోలు అవకాశం ఉంటే పంపాలి. రచనల్లో ఆత్మస్తుతి, పర నింద లేకుండా చూసుకోవాలి. ఎటువంటి వివాదాలకు తావివ్వకుండా తమ రచనలు కథ,కవిత,వ్యాసం,గల్పిక, పాట ఇలా ఏ సాహితీ ప్రక్రియ రూపంలో ఉన్నా స్వీకరిస్తాం. కవులు,కథకులు, రచయితలు తమ రచనలు అసలు ప్రతి (ఒరిజినల్) పంపడానికి ఆఖరు తేదీ 10 అక్టోబరు 2026.పంపాల్సిన చిరునామా రాజహంస, కేరాఫ్ బందిలి రతన్ రాజు ఇంటి నెంబరు 9-17-28/13, ఫ్లాట్ నెంబరు 502, సీబీఎం కాంపౌండ్, వీఐపీ టవర్స్ ఎదురు వీధి, విశాఖపట్నం-530 003, ఆంధ్రప్రదేశ్ అనే చిరునామాకు పోస్టు, కొరియర్, స్పీడు పోస్టు లేదా స్వయంగా పంపాలి.గమనిక: రచనలతోపాటు విధిగా ఈ రచన ఈ పోటీకోసం మాత్రమే చేసినట్టు, దేనికీ అనుసరణ, అనుకరణ కాదు, మరే ఇతర ప్రచురణ సంస్థ పరిశీలనలో లేదని హామీ పత్రంపై సంతకం చేసి విధిగా జతచేయాలి. ఎంపికైన ఉత్తమ రచనలకు నవంబరు నెలాఖరు లేదా డిసెంబరు రెండో వారం విశాఖపట్నంలో జరిగే కార్యక్రమంలో బహుమతి ప్రదానం ఉంటుంది. నిష్ణాతులైన సాహితీవేత్తలు నిర్ణేతలుగా వ్యవహరించే ఈ పోటీలో బహుమతి పొందిన,వారికి మాత్రమే కాకుండా పోటీలో పాల్గొన్నవారందరికీ అదే రోజు యోగ్యతా పత్రాల పంపిణీ ఉంటుంది. రచనలన్నింటినీ క్రోడీకరించి నిపుణులతో ఆంగ్లంలోకి తర్జుమా చేయించి, ఇల్లస్ట్రేషన్లు వేయించి ఈ ఏడాది చివరికల్లా "అబ్బష శీర్షికన వెలువరించే పుస్తకం ఎంపికైన శ్రేష్ఠమైన రచనలన్నింటికీ ప్రాధాన్యత ఉంటుంది. రచయితలు తమ కాపీలను ముందుగానే రిజర్వ్ చేసుకోవాల్సి ఉంటుంది. మరిన్ని వివరాలకు 9490263115 నంబరులో తనను సంప్రదించాల్సిందిగా బందిలి ఫౌండేషన్ కార్యనిర్వాహక సంచాలకులు బందిలి రతన్ రాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.




## బిజెపి ఆధ్వర్యంలో సేవా సంకల్ప అభియాన్

**మాడుగుల సెప్టెంబర్ 28 జయ జయహే**

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పుట్టినరోజు సందర్భంగా చేస్తున్న సేవా సంకల్ప అభియాన్ లో భాగంగా మాడుగుల గ్రామంలో అంగన్వాడీ 3 కేంద్రాన్ని సోమవారం బిజెపి నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా అంగన్వాడీకి వస్తున్న పౌష్టిక ఆహార వస్తువులు తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం విద్య తో పాటు చిన్నారులకు ఆటలు, పాటలు వంటివి నేర్పించాలని సూచించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్ , సూపెర్వైజర్ ను సత్కారించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా జోనల్ ఇంచార్జి మండల సంతోషి సుబ్బలక్ష్మి, బీజేపీ మండల మహిళా మోర్చా అధ్యక్షురాలు కర్రి మాధురి, బీజేపీ మండల ఉపాధ్యక్షులు కూడా వెంకటేశ్వర్లు, బీజేపీ నాయకులు స్థానిక న్యాయవాది శ్రీనాదు ప్రసాద రావు, కోన రామకృష్ణ, బత్తుల అరుణ పాల్గొన్నారు



## పుష్కరిణి అభివృద్ధికి కళాశీలూ విరాళం

**చోడవరం సెప్టెంబర్ 28 జయ జయహే**

చోడవరం స్వయంభూ శ్రీ గౌరీశ్వర స్వామి సన్నిధిలో జరుగుతున్న ఆలయ పుష్కరిణి అభివృద్ధి లో భాగంగా చోడవరం మండలం నర్సిపేటకు చెందిన శ్రీ అభయాంజనేయ కళాసి సంఘం వారు 35400 విరాళంగా అందజేశారు. ఈ మొత్తాన్ని సోమవారం ఆలయ ప్రధాన అర్చకులు కొడమంచిలి చలపతికి అందజేశారు. ఈ సందర్భంగా వారిని అభినందించారు.




## విద్యార్థులకు "నులిపురుగుల మాత్రల" పంపిణీ

**చోడవరం సెప్టెంబర్ 28 జయ జయహే**

చోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో జాతీయ సేవా పథకం, వడ్డాది పిహెచ్సి వారి నిర్వహణలో జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు సోమవారం నులిపురుగుల నివారణ మాత్రలు అందజేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పి కిరణ్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అనురాధ, వడ్డాది హెల్త్ డిపార్ట్మెంట్ వారి సౌజన్యంతో ఈ కార్యక్రమంలో నిర్వహించారు.ప్రస్తుత పరిస్థితులలో ప్రతి విద్యార్థి చిరుతిళ్లకు అలవాటు పడి వారి ఆరోగ్యం పాడు చేసుకోవడం మూలాన కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం ప్రతి విద్యార్థికి ఈ మాత్రలు పంపిణీ చేసి వారి ఆరోగ్యం కాపాడుకోవాలనీ తెలియజేశారు. మాత్రల పంపిణీ కార్యక్రమంలో స్టాఫ్ నర్స్ వై శ్రీదేవి, ఈశ్వరమ్మ, గౌరీ, జాతీయ సేవా పథకం ప్రోగ్రామ్ ఆఫీసర్స్ డాక్టర్ రత్న భారతి, డి.మాల్యాద్రి, బి. పిచ్చమ్మ, అకాడమిక్ సమన్వయకర్త డాక్టర్ మల్లీబాబు, సీనియర్ అధ్యాపకులు ఎంవి రామకృష్ణ, డాక్టర్ రాజ్ కుమార్, వెంకటేష్,డాక్టర్ పద్మావతి, డాక్టర్ లక్ష్మీ మంగమ్మ, డాక్టర్ సూర్యవతి, డాక్టర్ జ్యోతి, డాక్టర్ లక్ష్మి, డాక్టర్ షర్మిలశ్రీ, రామలక్ష్మి, కోమల, హేమ గణేష్, పిడి గణేష్, ఆఫీసు సూపర్నెంట్ రమేష్, లక్ష్మీనారాయణ ఇతర సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## బిజెపి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

**మాడుగుల సెప్టెంబర్ 28 జయ జయహే**

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధికారం చేపట్టి 25 సంవత్సరాలు పూర్తి అవడంతోపాటు మోడీ పుట్టినరోజు వేడుకలు సందర్బంగా బీజేపీ మండల అధ్యక్షులు మెలిపాక స్వామి ఆధ్వర్యంలో సోమవారం చింతలూరు గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో రోగులను తనిఖీ చేసి మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు కర్రి మాధురి, బీజేపీ నాయకులు స్థానిక న్యాయవాది శ్రీనాదు ప్రసాద రావు, కోన రామకృష్ణ, బత్తుల అరుణ, ఇల్లపు సురేంద్రనాథ్ ఇల్లపు సత్తిబాబు ,రాజు, సత్తిబాబు, కాంతరావు, గంగరాజు పాల్గొన్నారు




## గుర్రం జాషువా జయంతిని ప్రభుత్వమే నిర్వహించాలి

### మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్

**అమరావతి, సెప్టెంబర్ 28, జయ జయహే**

కవి కోకిల, నవయుగ చక్రవర్తి, పద్మభూషణ్ అవార్డు గ్రహీత వివక్షతకు, అసమానతలకు వ్యతిరేకంగా పద్య సాహిత్యంతో సామాజిక చైతన్యాన్ని రగిలించిన తెలుగు కవి గుర్రం జాషువా జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించకపోవడం దురదృష్టకరమని, భవిష్యత్తులో ఈ పొరపాటును సవరించుకొని ఏపీలో అన్ని జిల్లాలల్లో మరియు రాష్ట్రస్థాయిలో అధికారికంగా గుర్రం జాషువా జయంతి ఉత్సవాలను నిర్వహించాలని మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం గుర్రం జాషువా 131వ జయంతిని పురస్కరించుకుని గుంటూరు నగరంలోని గుర్రం జాషువా కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుంటూరు లేదా పల్నాడు జిల్లాకు మహనీయులు గుర్రం జాషువా పేరును రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించాలని కోరారు. 2018లో నాటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించిన గుర్రం జాషువా కళాపీఠం ను పూర్తి చేయాలని తద్వారా గుంటూరు నగరంలో కళాకారులకు, కవులకు, రచయితలకు, అభ్యుదయ వాదులకు కేంద్ర బిందువుగా మారుతుందని వివరించారు. గుర్రం జాషువా కళాపీఠంకు కావలసిన నిధులను వెంటనే మంజూరు చేయాలని కోరారు. జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ గుర్రం జాషువా 19వ దశాబ్దంలోనే వివక్షతకు గురవుతున్న దళితులు, గిరిజనులు, అభాగ్యుల జీవితాలను ప్రతిబింబించే సాహిత్యాన్ని తెలుగు ప్రజల ముందు ఉంచిన మహాకవి అని కొనియాడారు. మాదిగ జన సేవా సమితి నాయకులు అత్తోట జోసెఫ్ కుమార్, ప్రజా సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు



## రైవాడలో వైభవంగా వినాయక నిమజ్జనోత్సవం

**దేవరాపల్లి, సెప్టెంబర్ 28 జయ జయహే**

మండలంలోని రైవాడ గ్రామంలో వినాయక నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకొని బాల వినాయక సంఘం ఆధ్వర్యంలో నెలకొల్పిన భారీ వినాయకుడి అనుపు మహోత్సవం సోమవారం రాత్రి వైభవంగా జరిగింది. మహిళల కోలాటాలు, డీజే డాన్సులతో స్వామి వారి ఊరేగింపు జరిగింది. రైవాడ గ్రామం వినాయక నిమజ్జనోత్సవంతో సందడిగా మారింది. ఈ కార్యక్రమం ముగింపు ఉత్సవంలో భాగంగా మధ్యాహ్నం భారీ అన్న సమారాధన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయండి

### గ్రీవెన్స్‌లో కలెక్టర్‌ను కోరిన రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయండి

### కలెక్టర్‌ను మఠం శాంతకుమారి వినతి

**పాడేరు(జయ జయహే)**

పెదబయలు మండలాలకు సంబంధించిన పది పంచాయతీల ప్రజలకు అవసరమైన 15 కిలోమీటర్ల దూరం ఉండే నూతన రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కలెక్టర్ టి. నిశాంతి కు అల్లూరి సీతారామరాజు జిల్లా భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు మఠం శాంతి కుమారి కోరారు. గుత్తులు పుట్టు సంతబాయల నుంచి బంట్రోతు పుట్టు వరకు రోడ్డు నిర్మాణం జరగాల్సి ఉందని తెలిపారు. చాలా కాలంగా ఈ రోడ్డు నిర్మాణం కోసం ప్రజలు అనేక వినతి పత్రాలు ఇస్తున్న స్పందన కరువైందన్నారు. 10 పంచాయతీల ప్రజలకు ఈ రోడ్డు నిర్మాణం జరిగితే మేలు జరుగుతుందని తెలిపారు. 15 ఏళ్ల క్రితం ఈ రహదారి నిర్మాణం జరిగిన చాలా చోట్ల తీవ్రంగా దెబ్బతిన్నదని కనీసం మనుషులు నడిచేందుకు కూడా ఇబ్బందిగా ఉందన్నారు. విద్యార్థులు, రైతులు ఉద్యోగులకు అత్యవసరంగా అనారోగ్యానికి గురైన వారు తీసుకొచ్చేందుకు ఈ రోడ్డు చాలా అవసరం ఉందని అధికారులు స్పందించి నిధులు మంజూరు చేయాలని కోరారు. వర్షాకాలంలో అయితే ఈ రహదారిపై వెళ్లేందుకు కూడా అవకాశం ఉండదని బురద నీరుతో ఇరువైపులా నిండిపోయి ఉంటుందని పేర్కొన్నారు. అందులోనూ ఆరు కిలోమీటర్ల పాటు ఘాటీ సెక్షన్ ఉంటుందని అనేక ప్రమాదకర మలుపులు కూడా ఈ ఈ ఘాటి ప్రాంతాల్లో ఉంటాయన్నారు. ఈ రహదారి సరిగా లేక ఈ 10 గ్రామాలకు ఎవరికైనా అత్యవసరమై ఆస్పత్రికి రావాలన్న అంబులెన్స్ కూడా వెళ్లలేని దుర్భర పరిస్థితి ఎదురవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సల్ల రామకృష్ణ రాష్ట్ర కార్య వర్గ సభ్యులు, యువ మోర్చా జిల్లా అధ్యక్షులు ఎం గోపాల్ పాత్రుడు, లకే భాస్కర్ జిల్లా ట్రెజర్, లకే అబ్బాయి దొర ఎస్ టి మోర్చా జిల్లా అధ్యక్షులు, పెదబయలు మండల అధ్యక్షులు కే రాంబాబు, 10 గ్రామ ల ప్రజలు పాల్గోవటం జరిగింది.

For a pure tomorrow.. జయహో

# లాభాల మాయాజాలం.. రూ.3.73 కోట్లు హాంఫట్!

**సీహెచ్. ప్రతాప్**

**రూ.20 వేలతో మొదలైన ప్రయాణం.. రూ.3.73 కోట్ల నష్టంతో ముగిసింది! తెరపై రోజురోజుకూ పెరుగుతున్నట్లు కనిపించిన లాభాలు నిజమేనని నమ్మారు. నేరగాళ్లు చెప్పిన మాటలను విశ్వసించి మరింత పెట్టుబడి పెడుతూ వెళ్లారు. చివరకు ఖాతాలోని సొమ్మంతా ఆవిరై.. నకిలీ వెబ్‌సైట్ కూడా మాయమైంది. హైదరాబాద్‌కు చెందిన 40 ఏళ్ల ప్రైవేటు ఉద్యోగి సైబర్ నేరగాళ్ల పన్నిన పెట్టుబడి వలలో చిక్కుకుని రూ.3,73,66,634 నష్టపోయారు. దాదాపు తొమ్మిది నెలల్లో 1,107 లావాదేవీల ద్వారా డబ్బును బదిలీ చేశారు.**



హస్తినాపురం అగ్రికల్చర్ కాలనీకి చెందిన బాధితుడికి గత ఏడాది డిసెంబరులో సామాజిక మాధ్యమం ద్వారా పెట్టుబడులకు సంబంధించిన ఓ లింక్ వచ్చింది. లింక్ తెరిచిన తర్వాత 'జోషి' పేరుతో ఓ వ్యక్తి ఫోన్ చేశాడు. ఆన్‌లైన్‌లో షేర్లలో పెట్టుబడి పెడితే ఆరు నుంచి ఎనిమిది నెలల్లో భారీ లాభాలు పొందవచ్చంటూ నమ్మబలికాడు. అతడి మాటలు నమ్మిన బాధితుడు సూచించిన వెబ్‌సైట్‌లో ఖాతా తెరిచి 2026 జనవరి 4న రూ.20 వేలతో తొలి పెట్టుబడి పెట్టారు.

ఆ తర్వాతే అసలు వల బిగిసింది. వెబ్‌సైట్‌లో పెట్టుబడి మొత్తంతోపాటు లాభాలు, బోనస్‌లు పెరుగుతున్నట్లు కనిపించాయి. దీంతో మరింత పెట్టుబడి పెడితే మరింత లాభం వస్తుందని భావించిన బాధితుడు నేరగాళ్లు సూచించిన వివిధ బ్యాంకు ఖాతాలకు వరుసగా నగదు బదిలీ చేశారు. ఇలా తొమ్మిది నెలల వ్యవధిలో ఏకంగా 1,107 లావాదేవీలు జరిగాయి.

పెట్టుబడి మొత్తం భారీగా పెరిగిన తర్వాత దాన్ని వెనక్కి తీసుకునేందుకు ప్రయత్నించడంతో మోసగాళ్ల అసలు వ్యూహం బయటపడింది. డబ్బు ఉపసంహరించుకుంటే బోనస్‌లో గణనీయమైన మొత్తం కోల్పోతారని వెబ్‌సైట్‌లోని చాట్‌బాట్ ద్వారా హెచ్చరికలు పంపించారు. దీంతో మరికొంత కాలం వేచి చూశారు. అయితే ఎంతకాలం గడిచినా డబ్బు చేతికి రాలేదు.

చివరకు సెప్టెంబర్ 17న వెబ్‌సైట్ పూర్తిగా పనిచేయడం నిలిచిపోయింది. దీంతో తాను మోసపోయినట్లు గ్రహించిన బాధితుడు సెప్టెంబర్ 21న జాతీయ సైబర్ నేరాల ఫిర్యాదు పోర్టల్‌లో ఫిర్యాదు చేశారు. తెలంగాణ సైబర్ భద్రతా విభాగం కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించింది. నగదు ఏయే ఖాతాలకు చేరింది? వాటిని ఎవరు నిర్వహిస్తున్నారు? నకిలీ వెబ్‌సైట్ వెనుక ఉన్నది ఎవరు? అనే కోణాల్లో దర్యాప్తు సాగుతోంది.

తెరపై కనిపించే లాభాలు నిజమైనవే అన్న భ్రమే ఈ మోసానికి బలం. అధిక రాబడి పేరుతో వచ్చే ప్రతి పెట్టుబడి ఆహ్వానం వెనుక నిజానిజాలు తెలుసుకోకుండా అడుగు వేస్తే.. సంపాదించిన సొమ్ము మాత్రమే కాదు, ఏళ్ల కష్టం కూడా ఒక్క క్లిక్‌తో మాయమయ్యే ప్రమాదం ఉంది.



## ఘనంగా సంతోటలో గణనాథుని ఉత్సవాలు

**దేవరాపల్లి, సెప్టెంబర్ 28, జయ జయహే**

మండల కేంద్రం దేవరాపల్లిలోని సంతోటలో గణనాథుని ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా సోమవారం భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైసీపీ మాడుగుల నియోజకవర్గ సమన్వయకర్త ఈర్లే అనురాధ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు . అనంతరం అన్న సమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వెలమ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వరదపురెడ్డి సింహాచలం నాయుడు, ఆర్టిఐ విభాగం జిల్లా అధ్యక్షులు కె.వి.రమణ, గొర్లి దేవుళ్ళు, కొరుపోలు శ్రీను, వేచలపు అప్పలనాయుడు, గంగవంశం సంతోష్ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



## పిల్లల్లో రక్తహీనత నివారణకు నులి పురుగుల మాత్రలు వేసుకోవాలి

**ప్రభుత్వ వైద్యాధికారిణి డి. వనజ**

**దేవరాపల్లి, సెప్టెంబర్ 28, జయ జయహే**

పిల్లల్లో రక్తహీనత నివారణకు నులిపురుగుల మాత్రలు వేయాలని దేవరాపల్లి పి హెచ్ సి వైద్యాధికారిణి డి. వనజ అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని ఆమె దేవరాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం ప్రారంభించారు. ఒకటి నుంచి 19 ఏళ్ల లోపు పిల్లల రక్తహీనతను అరికట్టేందుకు ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలని సూచించారు. 42 అంగన్వాడి సెంటర్లలో 821మందికి, ప్రైమరీ స్కూల్స్ ప్రభుత్వ ప్రైవేట్ స్కూల్స్ లో 1228 మందికి, హై స్కూల్స్లో 1869 మందికి, ప్రభుత్వ ప్రైవేటు కాలేజీలో 475 మందికి మొత్తం 4165 మంది విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేయడం జరిగిందని వైద్యాధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ ఆనంద్, హెచ్ వి, వైద్య సిబ్బంది, అంగన్వాడి సిబ్బంది, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

## పల్లె పండగ 3.0 కింద 40 కోట్లు నిధులు మంజూరు

**మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి**

**దేవరాపల్లి, సెప్టెంబర్ 28, జయ జయహే**



మాడుగుల నియోజకవర్గంలోని నాలుగు మండలాల పరిధిలో ఉన్న 111 పంచాయతీలకు విబి జి రామ్ పల్లె పండగ 3.0 కింద 40 కోట్లు నిధులు మంజూరైనట్లు స్థానిక శాసన సభ్యులు బండారు సత్యనారాయణమూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మాడుగుల మండలంలోని 29 పంచాయతీలకు 10 కోట్లు, చీడికాడ మండలంలోని 23 పంచాయతీలకు10 కోట్లు, దేవరాపల్లి మండలంలోని 27 పంచాయతీలకు 10 కోట్లు, కె.కోటపాడు మండలంలోని 32 పంచాయితీలకు 10 కోట్లు రూపాయలు మంజూరు అయినట్లు వివరించారు. ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి కృషితో 4 మండలాలలో ఉన్న 111 పంచాయతీలకి 40 కోట్ల రూపాయలు మంజూరు చేయడం పట్ల కూటమి శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయనకు కూటమి నేతలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



## వర్షాలకు దెబ్బతిన్న సలమండ రోడ్డు మరమ్మతు చేయాలి

**డుంబ్రిగూడ: సెప్టెంబర్ 28 జయ జయహే.**

ఇటీవల కురిసిన వర్షాల ప్రభావం కారణంగా దెబ్బతిన్న డుంబ్రిగూడ మండలం కొర్ర పంచాయతి సలమండ రోడ్డును మరమ్మత్తు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎస్ బి పోతురాజు డిమాండ్ చేశారు. సోమవారం ఆ గ్రామంలో సందర్శించి వర్షాల కారణంగా దెబ్బతిన్న రోడ్డును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ,సిమిలిగూడ గ్రామం నుంచి సలమండ వరకు సుమారు ఐదు కిలోమీటర్ల దూరంలో బీటీ రోడ్డు లేకపోవడంతో ఆ గ్రామస్తులు రవాణా సౌకర్యం కోసం రాకపోకలు చేయడానికి అవస్థలు పడుతున్నారన్నారు. ప్రతి ఏడాది వర్షాలు కురిసినప్పుడు ఇదే పరిస్థితి ఏర్పడుతుందని ఆ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బీటి రోడ్డు నిర్మించాలని పలుమార్లు అధికారులకు విన్నవించిన పట్టించుకోవడంలేదని విమర్శించారు. సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో ఆ గ్రామస్తులు అనారోగ్యానికి గురైన తక్షణమే వైద్య సేవలు అందించడానికి హాస్పిటల్ కు తరలించలేక డోలి మోతలతో మోసుకెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని చెప్పారు. నిత్యవసర సరుకులు కొనుగోలు చేసుకోవాలన్న రోడ్డు మార్గం లేక నాన్న ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. తక్షణమే అధికారులు స్పందించి ఆ గ్రామంలో రోడ్డు సౌకర్యం కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.



## నడింపాలెం సచివాలయంలో పిజిఆర్ఎస్...

**కొయ్యూరు : (జయ జయహే )న్యూస్ సెప్టెంబర్ 29,**

అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం నడింపాలెం గ్రామ సచివాలయంలో ఆదివారం మీకోసం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులందరూ హాజరై ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ రోజు మొత్తం 47 ఫిర్యాదులు వచ్చాయన్నారు,రెవెన్యూ శాఖ 21, నీటి పారుదల శాఖ 7,జాతీయ రహదారి ఐదు వందల పదహారు ఈ 4,ఉపాధి హామీ పథకం 4,గృహ నిర్మాణ శాఖ 3,మహిళా శిశు సంక్షేమ శాఖ 3, వ్యవసాయ శాఖ 2, రహదారులు భవనాల శాఖ 1,విద్యుత్ శాఖ 1,పోలీసు శాఖ 1 వచ్చాయన్నారు,ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారులకు విన్నవించారు. వచ్చిన ప్రతి ఫిర్యాదును పరిశీలించి త్వరితగతిన పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, సచివాలయ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## 108 వాహనంలోనే ప్రసవం..

**కొయ్యూరు, సెప్టెంబర్ 29,**



అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం బుదరాళ్ల పంచాయతీ కన్నవరం గ్రామానికి చెందిన గేమ్మెల సుజాత (24), భర్త చిట్టిబాబు సోవ-ంవారం ఉదయం పురిటి నొప్పులతో బాధపడుతుండగా గ్రామస్తులు 108 వాహనానికి సమాచారం అందించారు. సిబ్బంది తక్షణమే స్పందించి గ్రామానికి చేరుకున్నారు. అప్పటికే పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో వైద్య సిబ్బంది ఈశ్వరరావు, వాహన చోదకుడు వినోద్ కుమార్ లు ఆమెను ఆసుపత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యలో చింతవాణిపాలెం గ్రామ సమీపంలోనే వాహనంలోనే సుజాత పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది.తల్లీబిడ్డ క్షేమంగా ఉ ండటంతో మెరుగైన వైద్యం కోసం ఇద్దరినీ రాజేంద్రపాలెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమయస్ఫూర్తితో వ్యవహరించి సురక్షిత ప్రసవం చేసిన 108 సిబ్బందిని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అభినందించారు.

# ఫ్యాక్టరీల ఆస్తులు ప్రభుత్వం అధీనంలోని ఉంచేలా చూడండి!!

**మంత్రి కొండపల్లి తో సమావేశమైన భీశెట్టి!!**

**అమరావతి (జయ జయహే)**



ఉత్తరాంధ్ర లోని సహకారం రంగంలోని ఉన్న ఐదు ఫ్యాక్టరీల్లో మూడు ఫ్యాక్టరీలను లిక్విడేట్ చేసి రైతుల, కార్మికుల, బ్యాంకుల బకాయిలు తీర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏపీఐఐసీ కి బాధ్యతలు అప్పగిస్తూ జీవో నెంబర్ 250 ని విడుదల చేసిందని రాష్ట్ర ప్రభుత్వం అనకాపల్లి జిల్లా లోని తాండవ, ఏటికొప్పాక, విజయనగరం జిల్లా లోని భీమసింగి సుగర్ ఫ్యాక్టరీల భూములను అమ్మకుండా ప్రభుత్వం వద్దే ఉంచి,సూక్ష్మ, చిన్న పరిశ్రమలకు లీజుకు ఇచ్చేలా చూడాలని సహకార చక్కెర ఫ్యాక్టరీల భూములు చాలా విలువైనవని, ఫ్యాక్టరీ నిర్మాణ దశలో నాటి పెద్దల త్యాగాలతో ఫ్యాక్టరీలు వచ్చాయాని దీని వెనుక రైతు కుటుంబాల సెంటిమెంట్ కూడా ఉందని ఏపీ లోక్ సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి రాష్ట్ర సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమలు ఎన్ఆర్ఐ వ్యవహారాల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ దృష్టికి తీసుకువచ్చారు సోమవారం మంత్రిని క్యాంపు కార్యాలయంలో సుగర్ ఫ్యాక్టరీ కార్మికుల తో కలిసి జీవో 250 ద్వారా ఉద్యోగుల, కార్మికుల, రైతుల బకాయిల కోసం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని త్వరగా అమలు చెయ్యాలని కోరారు, తాండవ, ఏటి కొప్పాక, భీమసింగి సుగర్ ఫ్యాక్టరీల పరిధిలో 1,114 మంది ఉద్యోగులకు సంబంధించి 40.20కోట్లు బకాయిలున్నాయని తాండవ, ఏటి కొప్పాక, లో రైతులకు బకాయిలు ఉన్నాయని, భీమసింగి లో రైతు బకాయిలు లేవని భీశెట్టి అన్నారు, మంత్రి కొండపల్లి ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టి కి తీసుకు వెళ్తానని హామీ ఇచ్చారు, వైకా పా నాయకులు రైతులకు అబద్దాలు ప్రచారం చేస్తున్నారని దానిని ప్రజలు తిప్పికొట్టాలని మంత్రి పిలుపు నిచ్చారు,భీమసింగి సుగర్స్ కార్మికులు, నాయకులు మంత్రి కొండపల్లి ని సత్కరించారు, ఈ కార్యక్రమం లో నాయకులు రౌతు సూర్య ప్రకాష్, లగుడు బంగారయ్య, భీశెట్టి అదిబాబు, రాంబాబు, మహంతి సన్నీ, జగన్నాధం, వర్మ,ఎర్నయుడు, శిరికి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com